

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



**విలేకరులు కావలెను**

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక.39 | శుక్రవారం | 4.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.39 | Friday | 4.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |




## అమరావతి సంగమం నిర్మాణానికి
# రూ.759.79 కోట్లు

- ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు
- 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

**అమరావతి:** 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అలాగే రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.281 కోట్ల నిధులు సమకూర్చుకునే ప్రతిపాదన, పొగాకు రైతులకు DBT ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అంశాలు కేబినెట్ ముందుకు వచ్చాయి. మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ–2026 ముసాయిదాకు ఆమోదం తెలిపింది. మంత్రివర్గ భేటీలో చర్చించిన విషయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759 కోట్ల 79 లక్షల పరిపాలనా అనుమతి ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో అమరావతి సంగమం నిర్మాణం చేపట్టనున్నారు. సాగునీరు, వరద పునరుద్ధరణకు సంబంధించి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 78 పనులకు రూ.6 కోట్ల24 లక్షలకు పైగా పరిపాలనా ఆమోదం, వ్యయానికి అనుమతిపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులపై చర్చ : వెలిగొండ టన్నెల్–2లో టీబీఎం తొలగింపు పనులకు రూ.11కోట్ల 63 లక్షల మంజూరుపైనా ఆమోదం తెలిపింది. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులకు సంబంధించిన అంశాలపైనా చర్చ జరిగింది. విద్యుత్ రంగంలో ఏపీ ట్రాన్స్‌కో మధ్యకాలిక రుణానికి

తరువాయి 2లో

# కొండాకు ఉద్వాసన

- కుమార్తె సుస్మిత వ్యాఖ్యల వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్
- రాజీనామా చేయాలని కోరినా ససేమిరా అన్న సురేఖ
- మంత్రి పదవి నుంచి తొలగిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం
- బర్తరఫ్‌కు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ఆమోదం

2



## లోక్‌భవన్‌కు ముఖ్యమంత్రి

- గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ
- కొండా సురేఖ బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం
- బర్తరఫ్ ఉత్తర్వులపై గవర్నర్ సంతకం
- కొండాను కేబినెట్ నుంచి తొలగించే అంశంపై శివప్రతాప్‌తో సీఎం చర్చ
- కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ

2



## సీఎం రేవంత్ రెడ్డిని కొండా సుస్మిత ఫైర్

- పరకాల నుంచి పోటీ చేయాలంటూ ముఖ్యమంత్రికి సవాల్
- తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన
- నాకు పదవులపై ఆశ లేదు: కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి

2

## రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపునకు
# భారత్ సిద్ధం

- శాంతి కోసం ఎలాంటి సహాయానికైనా రెడీ
- ఇరుదేశాలు కోరితే మధ్యవర్తిత్వానికీ సై
- యుద్ధభూమిలో సమస్యకు పరిష్కారం లేదు
- చర్చలు, దౌత్యంతోనే ముగింపు సాధ్యం
- విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్

2



## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసు

2



# పాతబస్తీలో మెట్రో పూర్తి చేసి చూపిస్తాం



- పాతబస్తీలో మెట్రో పూర్తి చేసి చూపిస్తాం
- పేదల ఇళ్లు తొలగిస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మూసీ ప్రక్షాళనను తప్పుబట్టడంపై బీజేపీ నేతలపై సీఎం విమర్శలు
- దేశభక్తిలో మోడీ, అమిత్ షాలకు అసద్ తక్కువేమీ కాదు
- చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం
- రూ.620 కోట్లతో 3.3 కి.మీ. నిర్మాణం
- మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి



**హైదరాబాద్:** పాతబస్తీ మెట్రో రైలు ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పామని, ఇచ్చిన మాట ప్రకారం చేసి చూపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో పాతబస్తీకి సముచిత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. ''బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం'' అని రేవంత్ వ్యాఖ్యానించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులను వేగంగా పూర్తి చేసిందన్నారు. ఈ ప్రాంతాన్ని 'ఓల్డ్ సిటీ'గా కాకుండా 'ఒరిజినల్ సిటీ'గా అభివర్ణించారు. పాతబస్తీలోని ప్రతి గల్లీ, ప్రతి ప్రాంతం తనకు తెలుసని చెప్పారు.

### మురుగు సమస్య లేకుండా చేస్తాం

మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ వంతెన పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు పర్యాటకంగానూ ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. పాతబస్తీలో నాలాలపై ఉన్న ఆక్రమణలను తొలగించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పేదల ఇళ్లు తొలగించాల్సి వస్తే వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

### హిందూ–ముస్లింల సమిష్టి కృషితో నగరాభివృద్ధి

హైదరాబాద్‌లో శతాబ్దాలుగా హిందూ–ముస్లింలు కలిసి జీవిస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇరువర్గాల సమిష్టి కృషితోనే నగరం అభివృద్ధి చెందుతూ వచ్చిందని పేర్కొన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ ప్రజలు ఈసీ, మూసీ నదుల నీటిని తాగేవారని గుర్తుచేశారు. విదేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే వారు చార్మినార్ వద్ద షాపింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతారని అన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమాలను బీజేపీ నేతలు తప్పుబట్టడంపై సీఎం మండిపడ్డారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో గంగానది, గుజరాత్‌లో సబర్మతి నది ప్రక్షాళన చేపట్టలేదా అని ప్రశ్నించారు. గంగా, సబర్మతి ప్రాజెక్టులను ప్రశంసించిన వారు మూసీ ప్రక్షాళనను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. రాష్ట్ర బీజేపీ నేతలు గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని విమర్శించారు.

### 'నన్ను బెదిరించలేరు'

తనను ఎవరూ బెదిరించలేరని, బెదిరింపులకు భయపడేది లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. తనను స్నేహంతోనే గెలుచుకోగలరని చెప్పారు. తాను ఎవరికీ గులామ్‌ను కాదని, దోస్తీకి మాత్రమే గులామ్‌నని

తరువాయి 2లో



## ఏళ్ల తరబడి విడిగా ఉంటే బంధం ముగిసినట్టే!

- వివాహ బంధాన్ని కాపాడటమే చట్టం లక్ష్యం
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- 2005 నుంచి వేర్వేరుగా ఉంటున్న దంపతులకు విడాకుల మంజూరు
- భార్యకు రూ.7 లక్షల శాశ్వత భరణం
- వినియోగదారుల కమిషన్లపైనా కీలక ఆదేశాలు

2

## ట్రంప్‌నకు మరోసారి కోర్టులో
# ఎదురుదెబ్బ



- జన్మతః పౌరసత్వంపై కొత్త ఉత్తర్వుల అమలుపై యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు స్టే
- విదేశీ వలసదారుల పిల్లలకు పౌరసత్వం పరిమితించే ప్రయత్నానికి బ్రేక్

2

# హైకమాండ్‌ను రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు

**హైదరాబాద్:** తన వివరణ తీసుకోకుండానే మంత్రి పదవి నుంచి తొలగించే నిర్ణయం తీసుకున్నారని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారని, చివరకు హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. తనను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశంలో మాట్లాడారు.

'ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. కానీ, నేను ఏ తప్పు చేశానో చెప్పకుండా, నా వివరణ తీసుకోకుండానే బర్తరఫ్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నా' అని అన్నారు. తనను మంత్రి పదవి నుంచి తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదని, ఆ విషయం తనకు పూర్తిగా తెలుసని పేర్కొన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌పై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు.

### 'నాతో పాటు సుమంత్‌పై కుట్ర'

తనతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారని కొండా సురేఖ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తనపై కక్షగట్టారని ఆరోపించారు. తనకు తెలియకుండా సుమంత్‌ను బాధ్యతల నుంచి తప్పించారని, పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.

### 'నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించడం లేదు'

మంత్రి పదవి నుంచి తొలగించినందుకు తాను బాధపడటం లేదని కొండా సురేఖ చెప్పారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదన్నారు. ప్రజాబలం ఉన్న నాయకులుగా తమకు ప్రజలు అండగా ఉంటారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవిపైనా ఆమె వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీని విమర్శించిన వారే తనపై చర్యలకు సిఫార్సు చేశారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిస్థితిపై గుండెలపై చేయి వేసుకుని ఆలోచించాలని సూచించారు. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొందని ఆరోపించారు.

### 'కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు'

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని కొండా సురేఖ అన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రభుత్వం సర్వే చేయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలకు పనులు చేయించుకోవడానికి ఎవరిని సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే అనేక మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. 'నావైపు ఒక వేలు చూపిస్తే.. రేవంత్‌రెడ్డి వైపు నాలుగు వేళ్లు చూపుతాయి' అని వ్యాఖ్యానించారు. తాను ఎమ్మెల్యేగా కొనసాగుతానని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎలాంటి 'ప్లాన్–బి'పై ఆలోచన చేయలేదన్నారు.

### 'దృఢంగా నిలబడతాం': కొండా మురళి

కొండా సురేఖ బర్తరఫ్‌పై ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరని వ్యాఖ్యానించారు. పదవులు ఉన్నా లేకున్నా తమ గౌరవం తమకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి అంశంపై తాము స్పందించకపోయినా అన్నింటినీ గమనిస్తూనే ఉంటామని తెలిపారు. తమపై ఎన్ని రాజకీయ దాడులు జరిగినా ఎదుర్కొని దృఢంగా నిలబడతామని, మొండిగా పోరాడగలమని కొండా మురళి పేర్కొన్నారు.

# పాతబస్తీలో మెట్రో పూర్తి చేసి చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. స్నేహం కోసం ఎంతవరకైనా వెళ్లే వ్యక్తినని అన్నారు. ఎన్నికలు వస్తుంటాయని, పోతుంటాయని.. గెలుపోటములు సహజమేనని పేర్కొన్నారు.

### రేవంత్ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందాలి: అసదుద్దీన్ ఒవైసీ

కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నందుకే తెలంగాణలో కాంగ్రెస్
ప్రభుత్వానికి తాము మద్దతు ఇస్తున్నామని తెలిపారు. రేవంత్‌రెడ్డి తనదైన శైలిలోనే పాలన కొనసాగించాలని సూచించారు. మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని కోరారు. రేవంత్‌రెడ్డి పాలనలో హైదరాబాద్, తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

### 30 నిమిషాల వరకు ప్రయాణ సమయం ఆదా

చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో చంచల్‌గూడ, సైదాబాద్, ఐఎస్ సదన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గనున్నాయి. ప్రయాణ సమయం గరిష్ఠంగా 30 నిమిషాల వరకు ఆదా కానుంది. రూ.620 కోట్ల వ్యయంతో 3.3 కిలోమీటర్ల పొడవున నిర్మించిన ఈ స్టీల్ ఫ్లైఓవర్ ద్వారా నల్గొండ ఎక్స్ రోడ్ నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు సులభంగా, ఆటంకాలు లేకుండా ప్రయాణించే అవకాశం కలుగుతుంది.

# రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపునకు భారత్ సిద్ధం

**కీవ్:** రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికేందుకు భారత్ ఎలాంటి సహాయానికైనా సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ఇరుదేశాలు కోరితే శాంతి స్థాపన కోసం మధ్యవర్తిత్వం చేసేందుకు కూడా భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. యుద్ధభూమిలో ఈ వివాదానికి పరిష్కారం లభించదన్నది భారత్ మొదటి నుంచీ చెబుతున్న వైఖరి అని పేర్కొన్నారు. సంప్రదింపులు, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమైన కొద్ది రోజులకే జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో భేటీ

ప్రస్తుతం ఉక్రెయిన్ పర్యటనలో ఉన్న జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులు, నల్ల సముద్రంలో నెలకొన్న భద్రతా పరిస్థితిపైనా చర్చించారు. భారత నావికులపై జరుగుతున్న దాడులపై జైశంకర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరుపుతున్నారు.

# కొండాకు ఉద్వాసన



**హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా కొనసాగుతున్న కొండా సురేఖ వ్యవహారానికి తెరపడింది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు లేఖ పంపగా.. గవర్నర్ ఆ సిఫార్సును ఆమోదించారు. దీంతో సురేఖ మంత్రి పదవి కోల్పోయారు. ఇప్పటికే సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం తెలిపిన నేపథ్యంలో సీఎం సిఫార్సు, గవర్నర్ ఆమోదంతో ప్రక్రియ పూర్తయింది.

### రాజీనామాకు నిరాకరణ

కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరినట్లు సమాచారం. అయితే ఆమె రాజీనామా చేసేందుకు నిరాకరించారు. దీంతో ఇక రాజీనామా చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా బర్తరఫ్ చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ మేరకు గవర్నర్‌కు లేఖ పంపగా.. ఆయన ఆమోదం తెలిపారు. దీంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా కొనసాగుతున్న పరిణామాలకు ముగింపు పడింది.

### సుస్మిత వ్యాఖ్యలతో వివాదం

పరకాల అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఈ మొత్తం వ్యవహారానికి కారణమైనట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పరకాల సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే వచ్చే ఎన్నికల్లోనూ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని సుస్మిత గత నెల 19న కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో బహిరంగంగా సవాల్ చేశారు. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నేతలపై ఆమె అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో ఈ వ్యవహారం పార్టీలో తీవ్ర దుమారం రేపింది. పలువురు కాంగ్రెస్ నేతలు పీసీసీకి ఫిర్యాదు చేశారు.

### క్రమశిక్షణ కమిటీ విచారణ

పీసీసీ సూచన మేరకు మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణ కమిటీ ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించారు. ఈ క్రమంలో కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరారు. సుస్మిత వ్యాఖ్యలపై ఆమె నుంచి వివరణ తీసుకున్నారు.

తన కుమార్తె స్వతంత్రంగా వ్యవహరించే వ్యక్తి అని, ఆమె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కొండా సురేఖ క్రమశిక్షణ కమిటీ ముందు స్పష్టం చేశారు. తన కుమార్తె వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కాదని పేర్కొన్నారు. అయితే సురేఖ వివరణపై క్రమశిక్షణ కమిటీ సంతృప్తి చెందలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. సుస్మిత వ్యాఖ్యలతో పార్టీ ప్రతిష్ఠకు నష్టం కలిగిందని అభిప్రాయపడిన కమిటీ.. సురేఖను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించి నివేదికను కాంగ్రెస్ అధిష్ఠానానికి పంపింది.

### ఢిల్లీలో కీలక మంతనాలు

ఈ వ్యవహారం అనంతరం ఢిల్లీ కేంద్రంగా కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హస్తినలో కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశమయ్యారు. పార్టీలో క్రమశిక్షణను కాపాడాల్సిన అవసరం ఉందని, కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు మరింత పెరిగే అవకాశం ఉందని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

మరోవైపు ఢిల్లీ వెళ్లిన కొండా సురేఖ కూడా కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గేను కలిసి తన వాదనను వినిపించారు. తనకు బీసీ సామాజికవర్గం నుంచి మద్దతు ఉందని, తమ కుటుంబానికి గణనీయమైన ఓటు బ్యాంకు ఉందని వివరించినట్లు తెలిసింది. అయినప్పటికీ అధిష్ఠానం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. సురేఖ రాజీనామా చేయాలని స్పష్టం చేసింది. ఆమె అందుకు అంగీకరించకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా బర్తరఫ్ చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కు లేఖ పంపారు.

### 'నన్ను బర్తరఫ్ చేయడం సరికాదు'

తనను మంత్రివర్గం నుంచి తొలగించడంపై కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. నిర్ణయం తీసుకునే ముందు తన వివరణ తీసుకోవాల్సిందని అన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను ఎలా బాధ్యురాలిని చేస్తారని ప్రశ్నించారు. "నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. నిర్ణయం తీసుకునే ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె చేసిన వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు? నా కుమార్తె స్వతంత్ర మహిళ. ఆమె చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలే" అని కొండా సురేఖ పేర్కొన్నారు.

### రెండు కీలక పదవుల్లోనూ మార్పులు

రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు కీలక పదవుల్లోనూ మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి.మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి జి.చిన్నారెడ్డిని తొలగించారు. ఆయన స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారదను ప్రభుత్వం నియమించింది.

## అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

రూ.950 కోట్ల ప్రభుత్వ గ్యారంటీ, సీలేరు కాంప్లెక్స్‌లో ఏపీ జెన్‌కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపు ప్రతిపాదనలు కేబినెట్ పరిశీలనకు వచ్చాయి. కడప జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు : ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల కేటాయింపు రద్దు, విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులో సామర్థ్యాల మార్పిడిపైనా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. APPDCL రుణాలకు సంబంధించి జెన్‌కోకు కార్పొరేట్ గ్యారంటీలు ఇచ్చేందుకు అనుమతిపైనా చర్చించింది. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం, కడప జిల్లాలో PM–కుసుమ్ కింద సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది.

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసు

**హైదరాబాద్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డికి కూడా నోటీసు వచ్చింది. గత ఎస్ఐఆర్‌లో ఇంటిపేరుతో సరిపోలక పోవడంతో సుదర్శన్‌రెడ్డికి నోటీసు ఇచ్చారు. అప్పుడు ఇంటిపేరు సి అని ఉండగా.. ప్రస్తుత ఓటరు జాబితాలో పూర్తిగా ఉండటంతో.. అనామలిస్ ఓటరుగా ఆయనకు నోటీసు జనరేట్ అయింది. ఈక్రమంలో సుదర్శన్‌రెడ్డి కార్వాన్ నియోజకవర్గంలో ఈఆర్‌ఓకు పాస్‌పోర్ట్‌ను ధ్రువీకరణ పత్రంగా సమర్పించి వివరణ ఇచ్చారు.

## లోక్‌భవన్‌కు సీఎం రేవంత్



**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి లోక్‌భవన్‌కు చేరుకున్నారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ కూడా వెళ్లారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సీఎం, మంత్రులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజాగా నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

ముఖ్యంగా కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించే అంశంపై గవర్నర్‌తో సీఎం చర్చించినట్లు సమాచారం. ఆమె బర్తరఫ్‌కు దారితీసిన పరిస్థితులను రేవంత్ రెడ్డి గవర్నర్‌కు వివరించారు. అనంతరం బర్తరఫ్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. సీఎం ఎదురుగానే గవర్నర్ బర్తరఫ్ ఉత్తర్వులపై సంతకం చేసినట్లు తెలిసింది. దీంతో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ లోక్‌భవన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

కొండా సురేఖ బర్తరఫ్‌తో తెలంగాణ కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు ఖాళీ అయ్యాయి. ఈ ఖాళీలను ఎవరితో భర్తీ చేయాలన్న అంశంపైనే తాజా భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా కొండా సురేఖ స్థానంలో ఎవరిని తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో కాంగ్రెస్ సీనియర్ నేత మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందనే ప్రచారం జరిగింది. మరోవైపు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఈ ఇద్దరిలో ఎవరికి అవకాశం దక్కుతుందనే చర్చ మొదలైంది. లేకపోతే కొత్త ముఖాలను కేబినెట్‌లోకి తీసుకొస్తారా అన్నది కూడా ఆసక్తిగా మారింది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఫైర్

**హైదరాబాద్:** తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు.

తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకా కుండా, నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో





కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

### నాకు పదవులపై ఆశ లేదు: చిన్నారెడ్డి

తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తనను తొలగించడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి స్పందించారు. పదవులపై తనకు ఆశ లేదన్నారు. పదవి ఉన్నా లేకున్నా తనకు గౌరవం ఉంటుందని చెప్పారు. తనకు క్యాబినెట్ హోదా ఉన్నప్పుడే కారు, డ్రైవర్, భద్రతను తీసుకోలేదన్నారు. పదవి కోసం సీఎంను కలిసే ప్రయత్నం చేయలేదని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# ఏళ్ల తరబడి విడిగా ఉంటే బంధం ముగిసినట్టే!



**న్యూఢిల్లీ:** వివాహాన్ని కాపాడడమే సంబంధిత చట్టాల ప్రాథమిక లక్ష్యమైనప్పటికీ, భార్యాభర్తలు సుదీర్ఘకాలం విడివిడిగా జీవిస్తున్నప్పుడు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. 2005 డిసెంబరు నుంచి వేర్వేరుగా ఉంటున్న దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్ ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. భార్యకు శాశ్వత భరణంగా రూ.7 లక్షలు చెల్లించాలని భర్తను ఆదేశించింది. తనకు విడాకులు మంజూరు చేసేందుకు మధ్యప్రదేశ్ హైకోర్టు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

భర్తను విడిచి వెళ్లే ఉద్దేశం భార్యకు లేదన్న హైకోర్టు అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అత్తవారింటికి తీసుకెళ్లేందుకు భర్త పలుమార్లు ప్రయత్నించినా, సరైన కారణం లేకుండానే ఆమె నిరాకరించిందని ధర్మాసనం గుర్తుచేసింది. దంపతులకు సంతానం లేకపోవడం, ఇన్నేళ్లుగా రాజీ ప్రయత్నాలు విఫలమవడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విడాకులు మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. వివాహ బంధం పునరుద్ధరించగల స్థితిలో ఉందా లేదా అన్నది నిర్ణయించడంలో దీర్ఘకాలంగా విడిగా జీవించడం కీలక అంశమని గతంలోనూ సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొంది.

### సంధికాలమంటూ కమిషన్ల మూసివేత తగదు

రాష్ట్ర, జిల్లా వినియోగదారుల కమిషన్లలో ఖాళీలపై స్థాయీ నివేదికకు మూడు వారాల్లోగా స్పందించాలని అన్ని రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. సంధికాలం పేరుతో కమిషన్లు పనిచేయకుండా ఉండటం సరికాదని స్పష్టం చేసింది. కమిషన్ సభ్యుల జీతభత్యాలపై గతంలో ఇచ్చిన ఆదేశాల అమలుపై చర్యా నివేదికను సమర్పించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం ఆదేశించింది.

నీట్, పీజీ రీ ఎగ్జామ్‌పై అత్యవసర విచారణకు నో

పరీక్ష రాయలేకపోయిన 2,445 మంది అభ్యర్థుల కోసం నీట్–పీజీని మళ్లీ నిర్వహించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇది గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధమని పేర్కొంటూ అత్యవసర విచారణ కోరారు. అయితే నీట్ వ్యవహారాలపై జస్టిస్ పి.ఎస్.నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే విచారణ చేపడుతున్నందున, అక్కడే ఈ అంశాన్ని ప్రస్తావించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచించారు.

## పిల్లలను నేరగాళ్లుగా చూడొద్దు

- పరిస్థితులే వారిని నేర ప్రపంచం వైపు నడిపించొచ్చు
- బాలల హక్కులను కాపాడి.. సమాజంలో పునరావాసం కల్పించాలి: సుప్రీం

**న్యూఢిల్లీ:** పిల్లలను శాశ్వతంగా నేరగాళ్లుగా ముద్ర వేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగినప్పుడు మైనర్‌గా ఉన్న వ్యక్తికి విధించిన శిక్షను రద్దు చేస్తూ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర, జస్టిస్ శ్రీచంద్రశేఖర్‌ల ధర్మాసనం బుధవారం కీలక వ్యాఖ్యలు చేసింది. బాలలకు చట్టం కల్పిస్తున్న రక్షణలు, ప్రయోజనాలను తోసిపుచ్చలేమని పేర్కొంది. సామాజిక, ఆర్థిక పరిస్థితులు, భావోద్వేగ, మానసిక అంశాలు కొన్నిసార్లు పిల్లలను నేర ప్రపంచం వైపు నడిపిస్తాయని ధర్మాసనం విశ్లేషించింది. పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో వలసలు పెరగడం, పట్టణాల్లో పేదరికం, అసమానత, నిరక్షరాస్యత, వివక్షాపూరిత పరిస్థితులు పిల్లలను నేరాల వైపు నెట్టే అవకాశం ఉందని తెలిపింది. అలాంటి వారిని శాశ్వత నిందితులుగా కాకుండా సమాజంలో తిరిగి కలిసేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది. దర్యాప్తు అధికారులు కేసుల్లో నిందితుల వయసుపై తగినంత దృష్టి సారించకపోవడం వల్ల బాలల హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలే దేశానికి అతిపెద్ద ఆస్తి అని, వారు బాధ్యతాయుతమైన, ఆరోగ్యకరమైన పౌరులుగా ఎదిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించింది. బాలలపై పెట్టే ఖర్చు భవిష్యత్తులో శక్తిమంతమైన మానవ వనరుల రూపంలో దేశానికి తిరిగి లభిస్తుందని పేర్కొంది. దర్యాప్తు వ్యవస్థను మరింత సమర్థంగా మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

### 17 ఏళ్ల నిందితుడి కేసులో..

మధ్యప్రదేశ్‌లోని మురైనాలో 2004 సెప్టెంబరులో నమోదైన కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఓ మహిళ, ఆమె బిడ్డ మృతదేహాలు రైలుపట్టాలపై లభించడంతో పలువురిపై కేసు నమోదైంది. ఇది వరకట్న చావుగా పేర్కొంటూ, ఆధారాలను మాయం చేసేందుకు నిందితులు ప్రయత్నించారని అభియోగాలు నమోదయ్యాయి. నిందితుల్లో ఒకరి వయసు 17 ఏళ్లు కావడంతో కేసు హైకోర్టు మీదుగా సుప్రీంకోర్టుకు చేరింది.



# ట్రంప్‌నకు మరోసారి కోర్టులో ఎదురుదెబ్బ

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు జన్మతః పౌరసత్వం విషయంలో మరోసారి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు పౌరసత్వం లభించకుండా పరిమితులు విధిస్తూ ట్రంప్ జారీ చేసిన తాజా కార్యనిర్వాహక ఉత్తర్వుల అమలును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. బర్త్ టూరిజాన్ని అరికట్టడంతో పాటు విదేశీ వలసదారుల పిల్లలకు అమెరికాలో జన్మతః లభించే పౌరసత్వంపై ఆంక్షలు విధించాలనే లక్ష్యంతో ట్రంప్ ఇటీవల కొత్త ఉత్తర్వులపై సంతకం చేశారు. అయితే వాటి అమలుకు కోర్టు బ్రేక్ వేసింది.

### ఇప్పటికే సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ

జన్మతః పౌరసత్వం విషయంలో ట్రంప్ తీసుకున్న చర్యలకు ఇప్పటికే అమెరికా సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. అక్రమ వలసదారులు లేదా తాత్కాలిక వీసాలపై అమెరికాలో ఉంటున్న వారి పిల్లలు అక్కడ జన్మిస్తే.. వారికి పౌరసత్వం కల్పించే హక్కును పరిమితం చేసే ప్రయత్నంపై న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో విదేశీ వలసదారుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలన్న ట్రంప్ ప్రయత్నాలకు వరుసగా అవరోధాలు ఎదురవుతున్నాయి.

### 14వ రాజ్యాంగ సవరణ ఏం చెబుతోంది?

అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ 1868లో ఆమోదమైంది. దాని ప్రకారం అమెరికా భూభాగంలో జన్మించిన వారికి సాధారణంగా జన్మతః పౌరసత్వం లభిస్తుంది. వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్నా ఈ నిబంధన వర్తిస్తుంది. అయితే ఈ నిబంధనను కొందరు 'బర్త్ టూరిజం' కోసం దుర్వినియోగం చేస్తున్నారని ట్రంప్ ఆరోపిస్తున్నారు. బిడ్డకు అమెరికా పౌరసత్వం లభించాలనే ఉద్దేశంతో ప్రసవ సమయం సమీపించినప్పుడు గర్భిణులు అమెరికాకు ప్రయాణించి అక్కడే ప్రసవించడం 'బర్త్ టూరిజం'గా పరిగణిస్తారు. దీనిని అరికట్టాల్సిన అవసరం ఉందన్నది ట్రంప్ వాదన. అయితే జన్మతః పౌరసత్వంపై ఆయన తీసుకుంటున్న చర్యలకు న్యాయస్థానాల్లో వరుసగా సవాళ్లు ఎదురవుతున్నాయి.

తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..





# నేత్రదానం.. మరో జీవితానికి వెలుగుదానం!

* వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఘనంగా నేత్రదాన అవగాహన ర్యాలీ
* కార్నియా అంధత్వ నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం
* ఏటా 2 లక్షల కార్నియాలు సేకరించాల్సిన అవసరం
* నేత్రదానంపై అపోహలు వీడి ముందుకు రావాలి: వైద్యులు
* మీ నేత్రదానం.. మరొకరికి చూపును ప్రసాదిస్తుంది

**తొలివెలుగు, ఎల్బీనగర్** : 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్‌లో నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో నేత్రదానంపై అవగాహన పెంచడంతో పాటు అపోహలు, అపనమ్మకాలను తొలగించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఇర్షాద్ అహ్మద్ సిద్ధిక్వి, డాక్టర్ ఎ. సురభి, డాక్టర్ నేహా జైన్, డాక్టర్ సాయి దివ్యారెడ్డి నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు దృష్టిలోపం ఉన్న వారికి చూపును అందించే అవకాశం ఉంటుందని, నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేత్రదాన ఉద్యమానికి విస్తృత ప్రచారం కల్పించడంలో మీడియా సంస్థలు కీలక పాత్ర పోషించాలని కోరారు. వాసన్ ఐ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. దేశంలో సుమారు 12 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రతి ఏడాది మరో 40 వేల మంది కొత్తగా కార్నియా అంధత్వానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కార్నియా అంధత్వాన్ని తగ్గించేందుకు ఏటా సుమారు 2 లక్షల కార్నియాలను సేకరించి, లక్ష కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏడాదికి సుమారు 50 వేల కార్నియాలు మాత్రమే సేకరిస్తున్నామని, వాటిలో సుమారు 27 వేల కార్నియా మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో కార్నియా కోసం ఎదురుచూస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నేత్రదానంపై ఉన్న అపోహలు, అపనమ్మకాల కారణంగా దాతల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగడం లేదని వైద్యులు పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చి మరొకరి జీవితంలో వెలుగు నింపాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా నేత్రదాన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించిన వాసన్ ఐ కేర్ హాస్పిటల్.. జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2011లో సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద దివంగత పద్మశ్రీ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభమైన వాసన్ ఐ బ్యాంక్ ఇప్పటివరకు సుమారు 14 వేల కార్నియాలను సేకరించగా, 8,500 కార్నియాలను దేశవ్యాప్తంగా కార్నియా మార్పిడి శస్త్రచికిత్సల కోసం వైద్యులకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్నియా అంధత్వంతో బాధపడుతున్న వారికి దృష్టిని అందించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటివరకు సుమారు 150 మంది ఐ బ్యాంక్ నిపుణులకు శిక్షణ అందించామని, వారు దేశంలోని వివిధ ఐ బ్యాంకుల్లో సేవలందిస్తూ కార్నియా అంధత్వ నిర్మూలనకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసన్ ఐ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవింద్ కుమార్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, నేత్రదాన ఉద్యమ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తోటి మిత్రుడికి 'నేస్తం' చేయూత

అనారోగ్యంతో బాధపడుతున్న సభ్యుడికి రూ.22 వేల ఆర్థిక సాయం

పూస శ్రీనివాస్‌కు పరామర్శ.. మనోధైర్యం అందించిన నేస్తం సభ్యులు

తలకు తీవ్ర గాయం.. మేజర్ ఆపరేషన్ నేపథ్యంలో ఆర్థిక సహాయం

అపదలో ఉన్న సభ్యులకు అండగా నిలుస్తున్న నేస్తం అసోసియేషన్



**తొలివెలుగు, రాజాపేట** : తోటి సభ్యుడికి అండగా నిలుస్తూ నేస్తం అసోసియేషన్ మానవతా దృక్పథాన్ని చాటుకుంది. రాజాపేటకు చెందిన నేస్తం అసోసియేషన్ సభ్యుడు పూస శ్రీనివాస్ ఇటీవల తలకు గాయమై మేజర్ ఆపరేషన్ చేయించుకోవడంతో ఆయనను అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. మనోధైర్యం కల్పించడంతో పాటు వైద్య ఖర్చుల కోసం రూ.22 వేల నగదు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా నేస్తం అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ సభ్యుల్లో ఎవరైనా అనారోగ్యం లేదా ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలిచి అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. స్నేహభావంతో పాటు సామాజిక బాధ్యతను కొనసాగిస్తూ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు సోమయ్య పేరబోయిన, సెక్రటరీ సోమేశ్ కదవేరుగు, ట్రెజరర్ ఆడెపు నరేందర్, గౌరవ అధ్యక్షుడు ఎడ్ల సర్వోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

* అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం
* ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి: కాంగ్రెస్ నేత సుధగాని నాగేష్



**తొలివెలుగు, చిన్నగూడూరు:** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుధగాని నాగేష్ అన్నారు. గురువారం చిన్నగూడూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి జరుగుతోందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని నాగేష్ సూచించారు. ప్రతి కార్యకర్త రోజుకు కొంత సమయం పార్టీ కోసం కేటాయించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని కోరారు. అసత్య ప్రచారాలకు తావివ్వకుండా వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యత, క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాగేష్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలు ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా పార్టీ శ్రేణులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలి

* అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రజా సమస్యలను ఎలా పట్టించుకుంటారు?
* వలిగొండలో మండల కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
* కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకుల విమర్శలు.. రాజీనామాకు డిమాండ్

**తొలివెలుగు, వలిగొండ** : మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేసీఆర్ ప్రతిపక్ష హోదాలో ఉండి అసెంబ్లీకి హాజరుకాకపోవడాన్ని నిరసిస్తూ ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వలిగొండ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకిరాములు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్ష హోదాలో కొనసాగుతున్న కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడం, ప్రజా సమస్యలపై చర్చించకపోవడం సరికాదన్నారు. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజాధనం నుంచి వేతనం పొందుతూ ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యమని వారు విమర్శించారు. కేసీఆర్ ప్రతిపక్ష హోదాలో ఇప్పటివరకు రూ.27 కోట్లకు పైగా వేతనం తీసుకున్నారని వారు ఆరోపించారు. ఈ ఆరోపణకు సంబంధించిన వివరాలను వారు వెల్లడించలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు చట్టసభల్లో చురుకైన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసే రవి, వైస్ చైర్మన్ జంగారెడ్డి, నాయకులు బద్దం సంజీవరెడ్డి, గుండు దానయ్య గౌడ్, కొండూరు భాస్కర్ గౌడ్, కాసుల వెంకన్న గౌడ్, ఐటిపాముల రవీంద్ర, గంగదారి రాములు, ఉపసర్పంచ్ మలగ మాధవి, వెంకటేష్, చిలుగూరు సత్తిరెడ్డి, ఎం.డి. కుర్షిద్, కూర వెంకన్న, అధిములం సోమేశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తిని నగేష్ గౌడ్, బత్తిని వరుణ్ గౌడ్, పూసుకురి లింగస్వామి, చిన్నపాక నరేంద్రతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారుల కేరింతలు.. కృష్ణయ్యల విన్యాసాలు!

* గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
* కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించిన విద్యార్థులు
* చిన్నారుల్లో సృజనాత్మకతతో పాటు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచాలి: వీణ అనిల్‌రెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్‌లోని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం విద్యార్థుల సందడి మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. చిన్నారుల కేరింతలు, శ్రీకృష్ణుని నామస్మరణలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. శ్రీకృష్ణుడి బాల్యలీలలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మి , ఏఓ మురళి పాల్గొని విద్యార్థులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ బండి వీణ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పండుగల ద్వారా పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను తెలియజేస్తూ, వారిలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు సంస్థలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## సస్పెండైన డీఎస్పీ భీమ్‌రెడ్డిపై మనీలాండరింగ్ కేసు



**తొలివెలుగు,హైదరాబాద్:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెండైన డీఎస్పీ భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. భీమ్‌రెడ్డికి చెందిన సుమారు రూ.150 కోట్ల అక్రమాస్తులను గుర్తించిన ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, బెంగళూరులో ఆస్తులను గుర్తించారు. వాటిలో అధిక భాగం బినామీల పేర్లపై ఉన్నట్లు నిర్ధరించారు. అవినీతి ద్వారా సంపాదించిన డబ్బుతోనే ఆస్తులు కొనుగోలు చేశారా? అనే కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తుల కొనుగోలు, నగదు లావాదేవీలు, నిధుల మూలాలపై ఆరా తీస్తున్నారు. భీమ్‌రెడ్డిపై ఇప్పటికే ఐటీ శాఖ కేసు నమోదు చేసింది. విచారణ అనంతరం భీమ్‌రెడ్డికి, బినామీలకు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.



## రాక్‌టౌన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

* 22/ఎ జాబితా నుంచి భూములను తొలగించాలి
* యుఎల్సీ రికార్డులు సరిచేయాలి..

ఎంపీ ఈటల రాజేందర్‌కు అసోసియేషన్ వినతి

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని రాక్‌టౌన్ కాలనీకి సంబంధించిన 22/ఎ నిషేధిత జాబితా, యుఎల్సీ సమస్యలను పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు జీఎస్ఐ డివిజన్, రాక్‌టౌన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు శామీర్‌పేటలోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని సర్వే నంబర్లు 12, 16కు సంబంధించిన సుమారు 39,067 గజాల భూమిని 22/ఎ నిషేధిత జాబితాలో చేర్చారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సదరు భూమి నిషేధిత జాబితాలోకి రాదని పేర్కొంటూ ఇప్పటికే సరూర్‌నగర్ ఎమ్మార్వో, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతులు సమర్పించినట్లు వివరించారు. అదేవిధంగా రాక్‌టౌన్ కాలనీకి యుఎల్సీ వర్తించదని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలు కొనసాగుతున్నాయని ప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇళ్ల రిజిస్ట్రేషన్లు, నిర్మాణ అనుమతుల విషయంలో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

## పోచంపల్లి చేనేత కళకు
# విద్యార్థుల పరిచయం

టూరిజం పార్క్, మ్యూజియం సందర్శన..

చేనేత కళాకారుల జీవన విధానంపై అధ్యయనం

* సదన్ డిగ్రీ కళాశాలకు చెందిన 180 మంది విద్యార్థుల పర్యటన
* చేనేత వస్త్ర కళా నైపుణ్యాన్ని తిలకించిన విద్యార్థులు
* చేనేత కార్మికుల గృహాలను సందర్శించి స్థితిగతులపై అధ్యయనం



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** హైదరాబాద్‌కు చెందిన సదన్ డిగ్రీ కళాశాలకు చెందిన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు 180 మంది గురువారం భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టూరిజం పార్క్, మ్యూజియంను సందర్శించి పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ఆసక్తిగా తిలకించారు. చేనేత కళాకారులు రూపొందిస్తున్న వివిధ రకాల వస్త్రాలు, వాటి తయారీ విధానం, కళా నైపుణ్యాలను విద్యార్థులు పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికుల గృహాలను సందర్శించి వారి జీవన విధానం, వృత్తిపరమైన పరిస్థితులు, చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ పర్యటన ద్వారా చేనేత కళ, కార్మికుల జీవన స్థితిగతులపై ప్రత్యక్ష అవగాహన కలిగిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమారం ఉన్నత పాఠశాలకు
# కంప్యూటర్ల బహూకరణ

* విద్యార్థుల విద్యాభివృద్ధికి దాత శీలం గోపాల్‌రెడ్డి చేయూత
* పాఠశాలకు కంప్యూటర్లను అందజేసిన దాత
* దాతకు కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు
* కార్యక్రమంలో ఉపసర్పంచ్, ఉపాధ్యాయుల బృందం పాల్గొనడం



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం సోమారం ఉన్నత పాఠశాలకు గోధుమకుంట గ్రామానికి చెందిన దాత శీలం గోపాల్‌రెడ్డి గురువారం కంప్యూటర్లను బహూకరించారు. విద్యార్థులకు సాంకేతిక విద్యపై మరింత అవగాహన కల్పించేందుకు కంప్యూటర్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు దాత శీలం గోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి కంప్యూటర్లను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబ్దుల్ అబిద్, దేవేందర్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# రఘునాథపురానికి యూరియా సబ్‌సెంటర్ మంజూరు చేయాలి

* రైతుల ఇబ్బందులు తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి: సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్
* యూరియా కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్న రైతులు
* రవాణా ఖర్చులు, సమయ నష్టంతో ఇబ్బందులు
* పీఏసీఎస్ సీఈఓకు వినతిపత్రం అందజేత



**తొలివెలుగు, రాజాపేట:** రఘునాథపురం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్ తెలిపారు. రైతులతో కలిసి గురువారం రాజాపేట పీఏసీఎస్ సీఈఓకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం పంటల సాగు సమయంలో యూరియాకు డిమాండ్ పెరిగిందని, అయితే రఘునాథపురం గ్రామంలో యూరియా సబ్‌సెంటర్ లేకపోవడంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని సంతోష్‌గౌడ్ పేర్కొన్నారు. దీంతో రైతులకు అదనపు రవాణా ఖర్చులతో పాటు సమయం కూడా వృథా అవుతోందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రఘునాథపురం గ్రామానికి యూరియా సబ్‌సెంటర్‌ను వెంటనే మంజూరు చేయాలని ఆయన కోరారు. రైతులకు అవసరమైన సమయంలో గ్రామంలోనే యూరియా అందుబాటులో ఉండేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పాల సంఘం చైర్మన్ ఎర్ర మల్లేశం, మాజీ వార్డు మెంబర్ కుందనపల్లి నరసింహులు, మాజీ చైర్మన్ వడ్లకొండ రమేష్, ఉచ్చతల భూపాల్, తుంగ ఉప్పలయ్య, సంజీవులు, మిరియాల ప్రశాంత్, గోరింకల అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# త్రీ ఫేస్ విద్యుత్ కోసం రైతుల ధర్నా..!

* విద్యుత్ నాణ్యత లోపంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతుల ఆవేదన
* రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నేతల విమర్శ
* సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా విషయంలో గతంలో ఉన్న సమయాన్ని తగ్గించడమే కాకుండా, ప్రస్తుతం సరఫరా చేస్తున్న విద్యుత్‌లో నాణ్యత లోపించిందని ఆరోపించారు. నాణ్యమైన త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటార్లపై భారం పడి అవి కాలిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, మరోవైపు నాణ్యత లేని విద్యుత్ సరఫరాతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు నాణ్యమైన త్రీ ఫేస్ విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని బీసు చందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్‌గౌడ్, లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, పట్టణ మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు యాస ఇంద్రారెడ్డి, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్‌గౌడ్, మామిడి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు కోరే బిక్షపతి, లగ్గాని రమేష్, బూడిద రాములు, కొల సత్తయ్యగౌడ్, మండల నాయకులు గడ్డం దశరథగౌడ్, కాలే మల్లేష్, పుట్ట నర్సిరెడ్డి, యాస అంజిరెడ్డి, సోమరాజు, నాతి రాజు, నాతి స్వామి, గజ్జెల్లి శంకర్, కావటి స్వామి, నాగుల రాజు, చిక్కిరి రవి, యాట మధు తదితర యువజన, విద్యార్థి నాయకులు, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణాష్టమి సంబరం.. మురిపించిన బాలకృష్ణులు



* క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కన్నులపండువగా వేడుకలు
* ఆకట్టుకున్న ఉట్ల ఉత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై వేడుకల్లో పాల్గొని అలరించారు. పాఠశాల మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్ల ఉత్సవంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్లు కొట్టడంతో పాటు వివిధ నృత్య ప్రదర్శనలు నిర్వహించి సందడి చేశారు. 'ఆనంద తాండవం' తదితర నృత్యాలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించిన ఉపాధ్యాయులు, సంప్రదాయ పండుగల ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మురళి, రషీద్, అలీం, ఉమారాణి, వినోద, పూనం, లావణ్య, ఆసియా, ఫారియా తదితరులు పాల్గొన్నారు.

# పరుగు పందెంలో శివాని సత్తా.. జాతీయ పోటీలకు ఎంపిక!



* 1000 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం.. తెలంగాణ తరఫున జాతీయస్థాయిలో బరిలోకి
* 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ
* పాండిచ్చేరిలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపిక
* శివానిని అభినందించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

**తొలివెలుగు, రామన్నపేట :** హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆగస్టు 26, 27 తేదీల్లో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని తోటకూరి శివాని అద్భుత ప్రతిభ కనబరి చింది. 1000 మీటర్ల పరుగు పందెంలో శివాని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం, వ్యాయా మ విభాగం అధిపతి డాక్టర్ ఎం. రవీందర్‌రావుతో పాటు అధ్యాపకులు శివానిని అభినందించారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు పాండిచ్చేరిలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఉప్పలంలో నిర్వహించనున్న 37వ సౌత్ జోన్ జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో శివాని తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నట్లు కళాశాల ప్రధానా చార్యులు, వ్యాయామ విభాగం అధిపతి తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లోనూ శివాని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# ఏసీబీ వలలో మరో భారీ అవినీతి తిమింగలం

సూర్యాపేట, కోదాడ టీపీఓ సోమయ్య నివాసాలపై ఏసీబీ దాడులు

ఏకకాలంలో 9 ప్రాంతాల్లో సోదాలు

ఐదు భారీ భవనాలు, వ్యవసాయ భూములు, బంగారం

రూ. 3.5 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు.. కోర్టులో హాజరుపరచనున్న అధికారులు



**తొలివెలుగు, సూర్యాపేట:** అక్రమాస్తులు కూడబెట్టారన్న పక్కా సమాచారంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి రాష్ట్రంలో పంజా విసిరారు.. గురువారం సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ టీపీఓ, కోదాడ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ టీపీఓ అయిన ఉయ్యాల సోమయ్య గుట్టురట్టు చేశారు. ఆయన సంపాదన అక్రమమని తేల్చిన ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఆయన ఇల్లు, కార్యాలయాలు సహా బంధువుల ఇళ్లపై దాడులు నిర్వహించి రూ. 3.5 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులను గుర్తించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా, కోదాడ మున్సిపాలిటీకి ఇన్‌చార్జ్ టీపీఓగా విధులు నిర్వహిస్తున్న ఉయ్యాల సోమయ్య తన సర్వీస్‌లో ఉండగా అక్రమ మార్గాల్లో మార్గాల ద్వారా ఆస్తులు కూడబెట్టారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించిన నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు ఆయనపై ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఈ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు సూర్యాపేట, హైదరాబాద్‌లోని హయత్ నగర్‌తో పాటు ఆయన బంధువులు, బినామీలకు చెందిన మరో 7 ప్రాంతాల్లో ఏకకాలంలో ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సోమయ్యకు సంబంధించిన భారీ ఆస్తుల చిట్టా బయటపడింది.

### బయటపడిన ఆస్తుల వివరాలు

సూర్యాపేట జిల్లా పరిధిలో సుమారు 03 ఎకరాల 03 గుంటల భూమి అధికారిక విలువ రూ.2,94,000. సూర్యాపేట, హయత్ నగర్ పరిధిలో ఏకంగా 5 భారీ నివాస ఆస్తులు ఉన్నాయి. ఇందులో ఒక G+1 బిల్డింగ్, ఒక G+2 బిల్డింగ్, ఒక G+4 తో కూడిన పెంట్‌హౌస్ బిల్డింగ్, అలాగే రెండు గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. వీటి అధికారిక విలువ రూ. 2,75,00,000గా చూపించారు. మార్కెట్ విలువ దీనికంటే ఎక్కువగా ఉంటుందని అంచనా. సూర్యాపేట పరిధిలో వివిధ ప్రాంతాల్లో 8 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ. 2,58,500 వరకు ఉంటుందని అంచనా. నగదు, బంగారం, వాహనాలు, సోమయ్య ఇంట్లో లెక్కలో చూపని రూ. 4,63,990 నగదు, బ్యాంకు ఖాతాలలో రూ. 13,00,000 నిల్వ, సుమారు రూ. 20 లక్షల విలువైన 709 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ఇవేకాకుండా రూ. 25,20,000 విలువైన 2 ఫోర్ వీలర్ వాహనాలు, 3 టూ వీలర్ వాహనాలు, రూ. 11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను గుర్తించారు మరోవైపు ఆయన బ్యాంకులో 66.9 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ. 49 లక్షల గోల్డ్ లోన్ కూడా తీసుకున్నట్లు తేలింది. వీటన్నింటినీ లెక్కగట్టిన ఏసీబీ అధికారులు సోమయ్య గ్రాండ్ టోటల్ ఆస్తుల విలువ అధికారిక లెక్కల ప్రకారమే రూ. 3,54,36,490 మూడు కోట్ల యాభై నాలుగు లక్షల ముప్పై ఆరు వేల నాలుగు వందల తొంభై రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. మార్కెట్ ధరల ప్రకారం ఈ ఆస్తుల విలువ ఇంకా రెండింతలు ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ సోదాల అనంతరం నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టు ఎదుట జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం హాజరుపరిచారు. ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

ఏదైనా ప్రభుత్వ శాఖలో ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అలాగే వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (@Telangana ACB) వేదికల ద్వారా కూడా ఏసీబీని సంప్రదించవచ్చని తెలిపారు.

# బొందుగులలో వైద్య శిబిరం ప్రారంభం

* హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించిన సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య
* 99 మందికి ఎక్స్‌రే పరీక్షలు
* సుమారు 130 మందికి షుగర్, బీపీ పరీక్షలు
* టీబీపై అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో గురువారం రాజాపేట పీహెచ్‌సీ, బొందుగుల ఏఎన్ఎం ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య, ఉపసర్పంచ్ అభిద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఎక్స్‌రే, కఫం (తెమడ) పరీక్షలతో పాటు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 99 మందికి ఎక్స్‌రే పరీక్షలు, సుమారు 130 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ సూపర్‌వైజర్ జ్యోతి, ఎయిమ్స్ టెక్నీషియన్లు, ఎంపీహెచ్ఓ భీకునాయక్, హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ అలేఖ్య, కవిత, అనిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

* రవిదాస్ గురూజీ చిత్రపటాలపై నల్ల ఇంకు చల్లిన ఘటనపై బీజేపీ ఫిర్యాదు
* చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు
* మహనీయులను అవమానించడం సరికాదు: మాసా శ్రీనివాస్
* కాంగ్రెస్ నాయకులు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**తొలివెలుగు, చిట్యాల:** శ్రీశ్రీ సంత్ శిరోమణి రవిదాస్ గురూజీ చిత్రపటాలపై నల్ల ఇంకు చల్లిన ఘటనకు బాధ్యులైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ చిట్యాల పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా సంత్ శిరోమణి రవిదాస్ జయంతి వేడుకల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మాసా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహనీయుల చిత్రపటాలను అవమానించేలా వ్యవహరించిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు ఈ ఘటనపై వెంటనే భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రుద్రవరం లింగస్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు శ్రీను, చికిలం మెట్ల అశోక్, జయ్యారపు రామకృష్ణ, కంచర్ల అశోక్‌రెడ్డి, చంద్రగిరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కంచర్ల శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శించిన గొంగిడి సునీత

* కంటి శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్
* బొందుగుల మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డికి పరామర్శ
* త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన గొంగిడి సునిత
* కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండలం బొందుగుల మాజీ సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కంటి సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి శస్త్రచికిత్స అనంతర ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో
# చిన్నారుల సందడి


* కృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించిన అంగన్‌వాడీ టీచర్లు
* సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకలు




**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట అంగన్‌వాడీ కేంద్రం–1, కుర్రారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అందంగా అలంకరించి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు బూర్గు స్వప్న, రేపాక భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ విశిష్టత, శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

* చిట్యాలలో నూతన పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం
* పాడి రైతులకు ప్రోత్సాహక పథకాలు అందిస్తున్న ప్రభుత్వం
* నూతన కేంద్రంతో పాల ఉత్పత్తిదారులు, వినియోగదారులకు ప్రయోజనం
* పాడి రైతులకు రూ.20 లక్షల ఆర్థిక సహాయం పంపిణీ
* మెట్ట పంటల సాగుపై రైతులకు సూచించిన వేముల వీరేశం, గుత్తా అమిత్‌రెడ్డి




**తొలివెలుగు, చిట్యాల:** రాష్ట్ర ప్రభుత్వం పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. గురువారం చిట్యాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు, పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పాల ఉత్పత్తిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు మెట్ట పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. చిట్యాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రం పాడి రైతులతో పాటు వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాడి రైతులకు రూ.20 లక్షల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మీ సైదులు, కౌన్సిలర్లు కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, గాలి యాదమ్మ–లింగయ్య, దేశపాక లత–రాజేష్, బొబ్బల సందీప్‌రామ్‌రెడ్డి, కోనేటి ఎల్లయ్య, నాయకులు నర్రా మోహన్‌రెడ్డి, ఎద్దులపురి కృష్ణ, జడల చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం చేస్తే కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

* కాంగ్రెస్ 'వెయ్యి రోజుల దగాకోరు పాలన'పై బీఆర్ఎస్ నిరసన
* రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్
* 420 హామీలతో ప్రజలను మోసం చేశారంటూ ఘాటు విమర్శలు
* విద్యుత్ ఏఈ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేత






**తొలివెలుగు, రాజాపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామచంద్రారెడ్డి ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరో ఐదు దశాబ్దాల వరకు అధికారంలోకి రాదని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం రాజాపేట మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాంగ్రెస్ వెయ్యి రోజుల దగాకోరు పాలన' నిరసన కార్యక్రమంలో కల్లూరి రామచంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారని ఆయన ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సైకిల్ యాత్ర పేరుతో ఎమ్మెల్యే భూకబ్జాలకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు చేశారు.
అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల నుంచి వివరణ వెలువడాల్సి ఉంది. రైతులకు విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఇప్పటికైనా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ చంద్రశేఖర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, రాజాపేట పట్టణ శాఖ అధ్యక్షుడు వీరేశం, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, బీఆర్ఎస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్‌గౌడ్, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి–యాదగిరిగౌడ్, మొల్లగూడెం సర్పంచ్ జన్నపల్లి బాలరాజురెడ్డి, కుర్రారం సర్పంచ్ బొడ్డు భాస్కర్, మండల ఉపాధ్యక్షుడు మొలుగు సోమలింగం, మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బొంగోని ఉప్పలయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బోగ హరినాథ్ తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కుర్రారంలో బీర్ల ఫౌండేషన్ చేయూత

* మృతుడి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన గజం శ్రీనివాస్ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చేయూత అందించింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత ద్వారా గురువారం బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రగుంట సునీల్, ఉపాధ్యక్షుడు పెంటపర్తి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్ద చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ బూత్కూరి నరసింహారెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు నీల నరసయ్య, గ్రామ పెద్దలు మేడి శ్రీనివాస్, ఎర్రగుంట రవీందర్, రాగుల రాజు, చిన్నం సంపత్, యూత్ అధ్యక్షుడు బండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోట మల్లారెడ్డికి పలువురు నాయకుల నివాళి

* మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గుత్తా అమిత్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్
* గుండెపోటుతో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోట మల్లారెడ్డి మృతి
* కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన నాయకులు
* మల్లారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసిన పలువురు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** గుండెపోటుతో బుధవారం మృతి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోట మల్లారెడ్డి మృతదేహాన్ని గురువారం పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర పాడి పరిశ్రమ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మల్లారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మల్లారెడ్డి మృతి పార్టీకి, ఆయన అనుచరులకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్ కూడా మల్లారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# బ్యాగు లేకుండా బడికి.. పుస్తకాల బరువుకు బ్రేక్!

* ఏడాదిలో 10 రోజులు 'బ్యాగ్‌లెస్ డేస్'.. ఆటలు, పాటలు, ప్రయోగాలతో అభ్యసనం
* 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'నో బ్యాగ్ డే'
* మూడో శనివారం కార్యాచరణ ఆధారిత అభ్యసనానికి ప్రాధాన్యం
* క్షేత్ర పర్యటనలు, క్విజ్‌లు, ప్రయోగాలు, బాలసభల నిర్వహణ
* స్థానిక కళాకారులు, చేతివృత్తిదారులతో విద్యార్థులకు పరిచయం
* విద్యార్థుల్లో సృజనాత్మకత, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాల పెంపు

**తొలివెలుగు, హైదరాబాద్:** విద్యార్థులపై చదువు ఒత్తిడిని తగ్గించి, తరగతి గది అభ్యసనాన్ని మరింత ఆసక్తికరంగా, ఆనందదాయకంగా మార్చేందుకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 2026–27 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని పాఠశాలల్లో 10 'బ్యాగ్‌లెస్ డేస్' నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ మార్గదర్శకాలు జారీ చేశారు.1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సాధారణ బోధనకు భిన్నంగా ఈ రోజుల్లో కార్యాచరణ ఆధారిత అభ్యసనానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

### మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు:



షెడ్యూల్ ప్రకారం మూడో శనివారం 'నో బ్యాగ్ డే' కార్యకలాపాలు నిర్వహించనున్నారు. విద్యార్థుల వయస్సు, తరగతి స్థాయి, ఆసక్తులు, స్థానిక పరిస్థితులు, పాఠశాలలో అందుబాటులో ఉన్న వనరులను బట్టి కార్యక్రమాలను ఎంపిక చేసుకునే వెసులుబాటు పాఠశాలలకు కల్పించారు. క్విజ్‌లు, బాలసభలు, క్షేత్ర పర్యటనలు, సర్వేలు, నాటికలు, ప్రయోగాలు, సబ్జెక్ట్ కార్నర్లు వంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

### స్థానిక పరిజ్ఞానానికి పెద్దపీట:

బ్యాగ్‌లెస్ డేలో భాగంగా విద్యార్థులను చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి స్థానిక చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు. స్థానిక కళాకారులు, చేతివృత్తిదారులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో పరస్పర కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుంది. తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, కళలు, క్రీడలు తదితర అంశాలపై కూడా కార్యాచరణలు చేపట్టవచ్చు.

### వృత్తి పరిచయంతో భవిష్యత్ నైపుణ్యాలు:

వివిధ వృత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్థానిక చేతివృత్తిదారులు, నిపుణులను పాఠశాలలకు ఆహ్వానించి వారి పనితీరును వివరించడం, చిన్నచిన్న ప్రదర్శనలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టవచ్చు.

### ఉపాధ్యాయులదే కీలకపాత్ర:

బ్యాగ్‌లెస్ డేను కేవలం వినోద కార్యక్రమంగా కాకుండా అభ్యసన ప్రక్రియలో భాగంగా నిర్వహించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉంది. ప్రధానోపాధ్యాయుడు కార్యక్రమాలను సమన్వయం చేయడంతో పాటు విద్యార్థుల భద్రతను పర్యవేక్షించాలి.

### ఒత్తిడి లేని అభ్యసనకు దోహదం:

పుస్తకాలకే పరిమితమైన విద్యకు బదులుగా అనుభవం ద్వారా నేర్చుకునే విధానం విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, బృందంగా పనిచేసే నైపుణ్యం, కమ్యూనికేషన్, పరిశీలన, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడనుంది.పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా చూడటం, పరిశీలించడం, ప్రయోగించడం ద్వారా విద్యార్థులు విషయాలను మరింత సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో బ్యాగ్‌లెస్ డే విద్యార్థులకు పుస్తకాల నుంచి విరామం కల్పించడమే కాకుండా పుస్తక జ్ఞానాన్ని జీవిత నైపుణ్యాలతో అనుసంధానించే వేదికగా మారనుంది.

### ప్రకటించిన బ్యాగ్‌లెస్ డే తేదీలు:

ప్రస్తుతం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 19, నవంబర్ 21, డిసెంబర్ 19, ఫిబ్రవరి 20, మార్చి 20 తేదీల్లో బ్యాగ్‌లెస్ డే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మిగిలిన తేదీలను విద్యాశాఖ తరువాత ప్రకటించనుంది.

# 'అర్పిత'లో నిర్వాకం.. గర్భసంచితో పాటు కిడ్నీ మాయం!

* గర్భసంచి శస్త్రచికిత్స పేరిట ఆలేరు డాక్టర్ల దారుణం
* అర్పిత నర్సింగ్ హోమ్ ఎదుట బాధిత కుటుంబసభ్యుల ధర్నా
* అనుమతి లేకుండా అవయవం తొలగించారంటూ ఆందోళన
* స్కానింగ్ చేయించడంతో వెలుగులోకి నిర్వాకం..
* బాధితుల ఫిర్యాదుతో ఆలేరు పోలీసుల కేసు నమోదు




**తొలివెలుగు, ఆలే :** రోగికి సమాచారం ఇవ్వకుండా, కనీసం కుటుంబ సభ్యుల అనుమతి కూడా తీసుకోకుండా గర్భసంచితో పాటు కిడ్నీని తొలగించిన దారుణ ఉదంతం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో వెలుగు చూసింది. ఈ ఘటన స్థానిక అర్పిత నర్సింగ్ హోమ్ వద్ద గురువారం తీవ్ర కలకలం రేపింది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

### బాధితుల కథనం ప్రకారం:

యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లి గ్రామానికి చెందిన కమలమ్మకు జూలై నెలాఖరులో తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆలేరులోని అర్పిత నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ ప్రభాకర్‌ను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యుడు.. గర్భసంచిని వెంటనే తొలగించాల్సి ఉంటుందని సూచించారు. డాక్టర్ ప్రభాకర్ పర్యవేక్షణలో ఓ ప్రత్యేక వైద్య నిపుణుడితో కమలమ్మకు శస్త్రచికిత్స పూర్తి చేశారు. అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారే తప్ప, గర్భసంచితో పాటు కిడ్నీని కూడా తొలగించిన విషయాన్ని బాధితులకు గానీ, వారి బంధువులకు గానీ తెలపలేదు.

### స్కానింగ్‌లో వెలుగు చూసిన దారుణం:

శస్త్రచికిత్స జరిగిన కొన్ని రోజుల తర్వాత కమలమ్మకు మళ్లీ కడుపునొప్పి తీవ్రమవ్వడంతో బాధితులు భువనగిరిలోని మరొక వైద్యుడిని సంప్రదించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు స్కానింగ్ పరీక్షలు చేయించగా, ఆమెకు ఒక కిడ్నీ మాత్రమే ఉందన్న విషయం బయటపడింది. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన కుటుంబ సభ్యులు గురువారం ఆలేరులోని అర్పిత నర్సింగ్ హోమ్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. తమకు తెలియకుండా, అనుమతి లేకుండా కిడ్నీ ఎలా తొలగిస్తారని వైద్యుడిని నిలదీయడంతో ఆసుపత్రి వద్ద తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.బాధితుల ఫిర్యాదు మేరకు ఆలేరు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆలేరు ఆలేరు ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్, వినయ్ తెలిపారు.

## గాయత్రి హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

* శ్రీకృష్ణుడి బాల్య లీలలను స్మరించుకుంటూ ఉట్టి కొట్టిన విద్యార్థులు
* కృష్ణుడి జన్మ విశిష్టతను వివరించిన ప్రిన్సిపాల్ అనురాధ
* సంప్రదాయబద్ధంగా కృష్ణాష్టమి వేడుకల నిర్వహణ
* విద్యార్థుల ఉత్సాహంతో సందడిగా మారిన పాఠశాల ప్రాంగణం





**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ పట్టణంలోని గాయత్రి హైస్కూల్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణుడి బాల్య లీలలను స్మరించుకున్నారు.
సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ.. శ్రావణ మాసంలోని కృష్ణ పక్ష అష్టమి, రోహిణి నక్షత్రం కలిసిన రోజున శ్రీకృష్ణుడు కంసుడి చెరసాలలో దేవకి, వసుదేవులకు జన్మించాడని తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని గోకులాష్టమిగా కూడా పిలుస్తారని, శ్రీకృష్ణుడి బాల్య లీలలను స్మరించుకుంటూ ఉట్టి కొట్టే వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తావుటాము నరహరి, మురళీధర్‌రెడ్డి, కొంతం బిక్షపతిగౌడ్, పాలకుర్ల వెంకటేశంగౌడ్, బిమిడి కవితారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హర్మూజ్ పేరును ట్రంప్ జలసంధిగా మారుస్తాం

**అది అమెరికా కంట్రోల్‌లోనే ఉంది : డొనాల్డ్ ట్రంప్**

**ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్–**

**రాడార్, క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేశామన్న ట్రంప్**



**న్యూయార్క్ :** ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ హర్మూజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మారుస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. హర్మూజ్ జలసంధి ఇప్పుడు అమెరికా నియంత్రణలో ఉందని, దానిపేరును ట్రంప్ జలసంధిగా మారిస్తే ఎలా ఉంటుందని అన్నారు. అమెరికా మాదిరిగా అది కూడా మునుపటి కంటే మరింత హాట్‌గా మారుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిపై సార్వభౌమాధికారం అమెరికాదేనని కొంతకాలంగా ప్రకటనలు చేస్తున్న ట్రంప్ దాన్ని అమెరికాలో కొత్త భూభాగంగా చూపుతూ ఇటీవల సోషల్ మీడియాలో ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు.
ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ప్రారంభించిన యుద్ధానికి ప్రతీకారంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో అంతర్జాతీయ చమురు సరఫరాపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడింది. భౌగోళిక ప్రాంతాల పేర్లను మార్చటం ట్రంప్‌నకు ఇదే కొత్తకాదు. కెనడాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిగ్గా వారంక్రితమే లేక్ అంటారియోను లేక్ అమెరికాగా మార్చుస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అంతకుముందు అమెరికా అధ్యక్షునిగా రెండోసారి అధికారం చేపట్టిన మొదటిరోజే గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చారు.

### నియంత్రణలో హర్మూజ్ జలసంధి

మరోవైపు ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం ఎక్కుగా కాలం కొనసాగుతుందని తాను భావించడం లేదని ట్రంప్ అన్నారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్, హర్మూజ్ జలసంధి చుట్టూ ఇరాన్ ఏర్పాటు చేసిన సైనిక వ్యవస్థలను అమెరికా ధ్వంసం చేసిందని చెప్పారు. హర్మూజ్ జలసంధి వెంబడి రాడార్, క్షిపణి సంబంధిత వ్యవస్థలతో సహా కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక పరికరాలను లక్ష్యంగా చేసుకుని, అమెరికా గత రాత్రి ఇరాన్‌పై చాలా తీవ్రమైన దాడి చేసిందని తెలిపారు. అలాగే హర్మూజ్ జలసంధిపై అమెరికాకు బలమైన నియంత్రణ ఉందని అన్నారు. హర్మూజ్ జలసంధిలో మందుపాతరలు అమర్చేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని, ఇందుకోసం ప్రత్యేక రాకెట్‌ను నిర్మిస్తున్నారని ఆరోపించారు.
హర్మూజ్ జలసంధి మా నియంత్రణలో ఉంది. అప్పుడప్పుడు వాళ్లు డ్రోన్‌ను కూల్చివేస్తున్నారు. అయినా కానీ మాకు చాలా బలమైన నియంత్రణ ఉంది. వాళ్లు తమ రాడార్ వ్యవస్థలను, క్షిపణి వ్యవస్థను, మందుపాతరలను జారవిడిచే వ్యవస్థను పునర్నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారు. మందుపాతరలను జారవిడిచే రాకెట్‌ను నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారు. అలా ఎవరు చేస్తారు? మందుపాతరలను జారవిడిచే రాకెట్‌ను మీరెప్పుడైనా నిర్మించారా? నేను అలాంటి దాని గురించి ఎప్పుడూ వినలేదు, కానీ వాళ్లు అదే చేస్తున్నారు. దాన్ని నిర్మిస్తున్నారు. అది దాదాపుగా పూర్తయింది, అందుకే మేము దాన్ని ధ్వంసం చేశాం.

### చమురు నౌకలకు భద్రత

హర్మూజ్ జలసంధి నుంచి భారీగా చమురును తరలించే నౌకలను బయటకు తీసుకురావడం కొనసాగిస్తున్నామని ట్రంప్ చెప్పారు. అమెరికా దళాలు వ్యూహాత్మక జలమార్గంలో అమర్చిన మందుపాతరలను తొలగించినట్లు పేర్కొన్నారు. లక్షలాది బ్యారెళ్ల చమురును మోసుకెళ్లే నౌకలు ఈ ప్రాంతం గుండా ప్రయాణిస్తుంటాయని, వాటి రాకపోకలకు ఆటంకం లేకుండా చూడటంపై అమెరికా దృష్టి సారించిందని తెలిపారు. హర్మూజ్ జలసంధిలో రాడార్, క్షిపణి వ్యవస్థలతో పాటు మందుపాతరలు అమర్చే సామర్థ్యాలను ఇరాన్ తిరిగి ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ట్రంప్ ఆరోపించారు.

## యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

**బిహార్‌లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన**

**పోలీసుల చర్యల్లో పలువురు విద్యార్థులు గాయపడ్డారని రాహుల్‌గాంధీ వ్యాఖ్య**

**యువత గొంతును అణచివేసే ప్రభుత్వాలు ప్రజలకు సమాధానం చెప్పక తప్పదని హెచ్చరిక**

**కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**



**పాట్నా:** బిహార్‌లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలు, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఆందోళనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. యువత గొంతును అణచివేసే ఏ ప్రభుత్వమైనా చివరికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని బీజేపీని ఉద్దేశించి హెచ్చరించారు. పరీక్షల్లో అక్రమాలు, నియామక ప్రక్రియలో పారదర్శకత కోరుతూ పోలీసుల చర్యలను ఎదుర్కొన్న బిహార్ విద్యార్థులు, యువతను రాహుల్‌గాంధీ కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన స్పందనను వెల్లడించారు.
విద్యార్థులు తమ హక్కుల కోసం పారదర్శకమైన పరీక్షా విధానం కోసం మాత్రమే ఆందోళన చేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే వారిపై లాఠీచార్జ్‌తో పాటు ఏకే–47, పిస్టళ్లతో కాల్పులు జరిగాయని ఆరోపించారు. ఈ ఘటనల్లో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలలు కన్న ఓ యువకుడి కాలికి ఏకే–47 బుల్లెట్ తగిలిందని పేర్కొన్నారు. ఆ బుల్లెట్ అతడి కాలినే కాకుండా జీవితాంతం కన్న సైనికుడిగా మారాలన్న కలను కూడా ఛిద్రం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి బలప్రయోగం ఎందుకు?'
విద్యార్థుల కోరింది న్యాయమైన అవకాశాలు, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ, తమ హక్కులేనని రాహుల్ గాంధీ అన్నారు. ఇలాంటి డిమాండ్లతో నిరసన చేస్తున్న యువతపై లాఠీలు, తుపాకీ కాల్పులు జరపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం కొందరు కింది స్థాయి అధికారులపై నిందలు వేసి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. ఇంతటి తీవ్ర బలప్రయోగం ఉన్నతస్థాయి ఆదేశాల ఫలితమైనా, లేదా పరిపాలనా వ్యవస్థ పూర్తిగా విఫలమైందనడానికి నిదర్శనమైనా కావచ్చని వ్యాఖ్యానించారు. బిహార్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ఆందోళన చేస్తున్న యువతకు తాను అండగా ఉంటానని తెలిపారు. వారికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. యువత గొంతును అణచివేసే ఏ పాలన అయినా చివరకు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని, ఆ రోజు ఎంతో దూరంలో లేదంటూ బీజేపీని ఉద్దేశించి రాహుల్‌గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**పట్నాలో ఉద్రిక్త పరిస్థితులు**
బిహార్‌లో విద్యార్థుల ఆందోళనలు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయ ఉద్యోగ నియామక పరీక్షను ఒకే దశలో నిర్వహించాలని, నియామక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగార్థులు నిరసనలకు దిగారు. గత నెలలో ఆందోళనకారులు ముఖ్యమంత్రి నివాసం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో పట్నాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. బిహార్ విద్యార్థుల ఉద్యమానికి వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలు మద్దతు ప్రకటిస్తున్నారు. ఆర్‌జేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ తేజస్వీ యాదవ్ కూడా విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా నిలిచారు. తాజాగా రాహుల్‌గాంధీ వారిని స్వయంగా కలిసి సంఘీభావం ప్రకటించడంతో ఈ అంశం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.
ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఎఫ్‌ఐఆర్ నమోదైంది. దీనిని కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. కేసును ఉపసంహరించుకోవాలని, శుద్ధీకరణ కార్యక్రమంలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు కూడా ఆ అంశంపై చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడతామని ప్రకటించారు.

## 'ట్రినిటీ'లో చిన్నికృష్ణుల ఉట్ల పండుగ

* నయనమనోహరంగా కృష్ణాష్టమి వేడుకలు
* సత్యం, ధర్మ మార్గంలో నడవాలి: ఉజ్జిని మంజుల






**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్ కిడ్స్ జోన్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నికృష్ణుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ ఉజ్జిని మంజుల చిన్నికృష్ణులతో ఉట్లు కొట్టించి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం గోపికల వేషధారణలో బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి జీవిత చరిత్ర, ఆదర్శాలను విద్యార్థులకు వివరించారు. చిన్నతనంలో తన చిలిపి చేష్టలతో అందరినీ అలరించిన శ్రీకృష్ణుడు.. లోకకల్యాణం కోసం గోవర్ధనగిరిని ఎత్తి ప్రజలను కాపాడిన తీరును వివరించారు. కురుక్షేత్ర సంగ్రామంలో ధర్మం వైపు నిలిచి విజయాన్ని సాధించడంలో శ్రీకృష్ణుడి పాత్రను గుర్తుచేశారు.విద్యార్థులు శ్రీకృష్ణుడి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని నిజాయితీ, సత్యం, ధర్మ మార్గంలో నడవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు స్వరూప, భార్గవి, ఉపాధ్యాయులు మౌనిక, జ్యోతి, అరుణ, స్వరూప, భాగ్యలక్ష్మి, శ్వేత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

* రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
* నూతన చైర్మన్‌గా ఏనగండ్ల సుధాకర్ బాధ్యతల స్వీకారం
* చైర్మన్, డైరెక్టర్లను సన్మానించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య
* వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆత్మ కమిటీలు కీలకపాత్ర పోషించాలి
* ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా కృషి చేయాలి



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆత్మ కమిటీ చైర్మన్ ఏనగండ్ల సుధాకర్, డైరెక్టర్లను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఘనంగా సన్మానించి, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించడంలో ఆత్మ కమిటీలు కీలకపాత్ర పోషించాలని సూచించారు.
ఆలేరు నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలు పూర్తిస్థాయిలో చేరేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని అన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏనగండ్ల సుధాకర్‌తో పాటు నూతన డైరెక్టర్లందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ప్రభుత్వం, రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఆలేరు నియోజకవర్గాన్ని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

* కొప్పుల శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం
* బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు
* ఆపదలో అండగా నిలిచిన నాయకులు, గ్రామస్థులు



**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలం అరూర్ గ్రామానికి చెందిన కొప్పుల శంకర్‌గౌడ్ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పలువురు ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి, ఉపసర్పంచ్ గొడ్డటి సత్యం, గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ యాదవ్ రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కార్యక్రమంలో వేముల అనిల్, గుట్ట ధర్మకర్త దామర అంజయ్య, శివాజీ, యూనియన్ అధ్యక్షుడు బత్తిని కర్ణగౌడ్, కాంగ్రెస్ నాయకులు బండారు మైపాల్‌రెడ్డి, చిలకమర్రి ఉపేందర్, ఎలిమినేటి పెంటయ్య, కొప్పుల దాసు, ఎర్రగుట్ట, ఎర్ర శ్రీనివాస్, లోతుకుంట లక్ష్మణ్, నల్ల రాములు, బత్తిని కిష్టయ్య, అధ్యక్షుడు ఎర్ర సాయిగౌడ్, ఉపాధ్యక్షుడు పాక మహేష్, సోషల్ మీడియా ప్రతినిధి బుర్ర శ్రీకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరో కిరీటమా.. హ్యాట్రిక్ టైటిలా!

- జూనియర్ ఆసియా కప్‌పై భారత్ గురి
- జూనియర్ ఆసియా కప్‌లో సత్తా చాటేందుకు ఆటగాళ్లు రెడీ



**మోక్షీ:** ఏహెచ్‌ఎఫ్ జూనియర్ ఆసియా కప్ హాకీలో భారత పురుషుల, మహిళల జట్లు టైటిళ్లు నిలబెట్టుకునే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాయి. అండర్–21 పురుషుల జట్టు రికార్డు స్థాయిలో ఆరోసారి, మహిళల జట్టు వరుసగా మూడోసారి కిరీటం సాధించాలని పట్టుదలగా ఉంది. గత రెండు ఎడిషన్ల విజేత భారత మహిళల జట్టుకు మిడ్‌ఫీల్డర్ ఖైదెమ్ షిలెయిమా చాను నాయకత్వం వహించనుంది. కోచ్ టిమ్ వైట్ ఆధ్వర్యంలో జట్టు ప్రత్యేక శిక్షణ పొందగా, బ్రిటన్ పర్యటనలో స్కాట్లాండ్ సీనియర్, అమెరికా, ఇంగ్లండ్, బెల్జియం అండర్–21 జట్లతో సన్నాహక మ్యాచ్‌లు ఆడింది. ఎలైట్ పూల్‌లోని భారత్ సెప్టెంబర్ 5న దక్షిణ కొరియా, 6న మలేసియా, 8న జపాన్, 9న చైనాతో తలపడనుంది. ఇక ఐదుసార్లు విజేతగా నిలిచిన పురుషుల జట్టు గత మూడు ఎడిషన్లలోనూ టైటిల్ సాధించింది. డిఫెండర్ అన్మోల్ ఎక్కా కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, కొత్త కోచ్ ఫ్రెడెరిక్ సోయెజ్ టైటిల్‌తో బాధ్యతలు ప్రారంభించాలని భావిస్తున్నాడు. సన్నాహకాల్లో ఆస్ట్రియా, బెల్జియం, జర్మనీ, నెదర్లాండ్స్ అండర్–21 జట్లతో పాటు మలేసియా, చైనాలతో మ్యాచ్‌లు ఆడిన భారత్.. చివరి పోరులో చైనాపై 8–2తో గెలిచి ఆత్మవిశ్వాసం పెంచుకుంది. పూల్–ఏలోని భారత్ సెప్టెంబర్ 5న ఇండోనేషియా, 6న జపాన్, 8న దక్షిణ కొరియా, 9న చైనీస్ తైపీతో పోటీపడుతుంది.

# టీమిండియా కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్?



**న్యూఢిల్లీ:** ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి–నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో డిన భారత బందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ డా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది. వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషికేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో క్రికెట్ జట్లకు వసతి ఏర్పాట్లపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ కీలక వివరణ ఇచ్చారు. గదుల కొరత ఉన్నప్పటికీ పాల్గొనే జట్లకు హోటల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు టీ20 క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జట్లు కోరుకుంటే తమకు నచ్చిన వసతిని స్వయంగా ఏర్పాటు చేసుకునే అవకాశం డా ఉందని మియాజీ చెప్పారు. సరైన డ్రెస్సింగ్ రూమ్స్ లేకపోవడంతో పాటు వాష్ రూమ్స్ అధ్వాన్నంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వసతులపై బీసీసీఐ అసంతప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడను

- సీఎస్‌కేకు స్పష్టం చేసిన ధోనీ
- 2027 ఐపీఎల్‌లో కొనసాగింపుపై ఉత్కంఠ
- పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే ఆడతానన్న టీమిండియా మాజీ కెప్టెన్
- శరీరంపై భారం తగ్గేందుకు ఇంపాక్ట్ విధానమే మేలు: బద్రీనాథ్



**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఐపీఎల్‌లో తన భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు మరో ట్విస్ట్ వచ్చింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా కొనసాగాలనే ఉద్దేశం తనకు లేదని మహేంద్ర సింగ్ ధోనీ స్పష్టం చేసినట్లు మాజీ చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ వెల్లడించాడు. ఒకవేళ ఐపీఎల్‌లో ఆడితే పూర్తి స్థాయి వికెట్ కీపర్‌గానే కొనసాగాలని ధోనీ భావిస్తున్నట్లు తెలిపాడు. ధోనీ ప్రస్తుత ఫిట్‌నెస్, పరిమిత బ్యాటింగ్ పాత్రను దృష్టిలో ఉంచుకుంటే ఇంపాక్ట్ ప్లేయర్ విధానం అతడికి సరిపోతుందని బద్రీనాథ్ అభిప్రాయపడ్డాడు. 20 ఓవర్లు వికెట్ కీపింగ్ చేయడం వల్ల శరీరంపై భారం పెరుగుతోందని.. బ్యాటింగ్‌లోనూ 16వ ఓవర్ తర్వాతే ఎక్కువగా వచ్చే పరిస్థితుల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడితే సీఎస్‌కేకు వ్యూహాత్మకంగా ప్రయోజనం ఉంటుందని చెప్పాడు. 45 ఏళ్ల ధోనీ గత కొన్ని సీజన్లుగా ఫిట్‌నెస్ సమస్యలను ఎదుర్కొంటున్నాడు. ఐదు ఐపీఎల్ టైటిళ్లు సాధించిన ధోనీ 2024 సీజన్‌కు ముందు సీఎస్‌కే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అప్పటి నుంచి బ్యాటింగ్‌లో అతడి పాత్ర పరిమితమైంది. ఇంపాక్ట్ ప్లేయర్ విధానం భారాన్ని తగ్గించగలిగినా.. పూర్తి స్థాయి వికెట్ కీపర్‌గా ఆడాలన్న ధోనీ నిర్ణయంతో 2027 సీజన్‌లో అతడు బరిలోకి దిగుతాడా లేదా అన్నది ఆసక్తిగా మారింది.

# విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు

- పాక్ క్రికెట్ ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది
- ఓటములతో అంతా ముగిసినట్లు భావించొద్దు
- పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ



**లండన్:** ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో పాకిస్థాన్ వరుస ఓటములపై వస్తున్న విమర్శలను పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. జీవితంలో ఏమీ సాధించని వారే జట్టును విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మూడు టెస్టుల సిరీస్‌లో పాక్ 0–2తో వెనుకంజలో ఉంది. కొన్ని ఓటములతో పాక్ క్రికెట్ ముగిసిపోయిందనడం సరికాదని నఖ్వీ అన్నారు. వన్డే ర్యాంకింగ్‌లో 8వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరామని, ఇటీవల ఆరు వన్డే సిరీస్‌ల్లో నాలుగింటిని గెలిచామని తెలిపారు. జట్టు విజయశాతం 24 నుంచి 73కు పెరిగిందన్నారు. భారత్ సహా పలు జట్లు బలహీన ప్రత్యర్థుల చేతిలో ఓడిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఎంపికలో తప్పులు జరిగితే తానే బాధ్యత వహిస్తానని, సరిగా రాణించని ఆటగాళ్లపై అవసరమైన చర్యలు తీసుకుంటామని నఖ్వీ చెప్పారు. అయితే 9వ స్థానం నుంచి మూడు, ఆరు నెలల్లోనే జట్టును నంబర్‌వన్‌గా మార్చడం సాధ్యం కాదని, పాక్ క్రికెట్ ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉందన్నారు.

# చైనా మాస్టర్స్‌లో శ్రీకాంత్ సంచలనం

- ప్రపంచ 9వ ర్యాంకర్ లాయ్‌పై వరుస గేముల్లో విజయం
- పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్లోకి..
- డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ ముందుకు



**షెన్‌జెన్:** భారత సీనియర్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ చైనా మాస్టర్స్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన విజయం సాధించారు. ప్రపంచ 9వ ర్యాంకర్, కెనడాకు చెందిన విక్టర్ లాయ్‌ను వరుస గేముల్లో 21–18, 21–19తో ఓడించి పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. మొదటి గేమ్‌లో 11–15తో వెనుకబడిన శ్రీకాంత్ వరుస పాయింట్లతో పుంజుకుని 18–16 ఆధిక్యంలోకి వచ్చారు. రెండో గేమ్‌లోనూ 5–9, 9–14తో వెనుకబడ్డప్పటికీ పట్టువదలకుండా పోరాడి 18–18తో సమం చేశారు. అనంతరం కీలక పాయింట్లు సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. క్వార్టర్‌ఫైనల్లో హాంకాంగ్‌కు చెందిన లీ చుక్ యూను ఎదుర్కోనున్నారు. పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి కూడా క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో, తోమా జూనియర్ పొపోవ్ సోదరులను 21–15, 22–24, 21–9తో ఓడించింది. రెండో గేమ్‌లో మ్యాచ్ పాయింట్లు కోల్పోయినా నిర్ణాయక గేమ్‌లో దూకుడుగా ఆడి విజయాన్ని ఖాయం చేసుకుంది.

### తాన్వీ శర్మకు నిరాశ

మహిళల సింగిల్స్‌లో ఇటీవల తైపీ ఓపెన్ సూపర్–300 టైటిల్ గెలిచిన తాన్వీ శర్మ పోరాడి ఓడిపోయారు. ప్రపంచ 9వ ర్యాంకర్ జపాన్‌కు చెందిన తోమోకా మియాజాకీ చేతిలో 17–21, 21–18, 16–21తో పరాజయం పాలై రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల–తనిషా క్రాస్టో జోడీ 18–21, 18–21తో చైనీస్ తైపీ జోడీ చేతిలో ఓడింది.

# ఆసియా క్రీడలకు 77 మంది భారత అథ్లెట్లు

- నీరజ్ స్థానంలో యశ్వీర్ సింగ్
- అభిషేక్ పాల్, తేజస్ షిర్సేలకు ఉద్వాసన



**లూధియానా:** జపాన్‌లో ఈ నెల 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఆసియా క్రీడలకు 77 మంది సభ్యులతో కూడిన భారత అథ్లెటిక్స్ జట్టును ఏఎఫ్ఐ గురువారం ప్రకటించింది. గాయపడిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్థానంలో కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత యశ్వీర్ సింగ్‌కు చోటు కల్పించింది. డోపింగ్ నోటీసు అందుకున్న లాంగ్ డిస్టెన్స్ రన్నర్ అభిషేక్ పాల్, గాయపడిన 110 మీటర్ల హర్డిల్స్ రన్నర్ తేజస్ షిర్సేలను తప్పించింది. ఆరుగురికి కొత్తగా అవకాశం: 200 మీటర్ల రన్నర్ హరీతా భద్ర, కిరణ్ పహల్ (క్వార్టర్ మైల్), సింధుశ్రీ జి (పోల్‌వాల్ట్), ఐ. ఆశా ఇలంగో (ట్రిపుల్ జంప్), సాన్యా యాదవ్ (డిస్కస్ త్రో), ప్రవీణ్ కుమార్ (హ్యామర్ త్రో)లను కొత్తగా చేర్చింది. దీంతో 73 మంది బృందంలో ఇద్దరు తప్పుకోగా, ఆరుగురు చేరడంతో సంఖ్య 77కు చేరింది. అభిషేక్ పాల్ డోప్ శాంపిల్‌లో మహిళల సంతానోత్పత్తికి ఉపయోగించే ఔషధ పదార్థం నిర్దేశిత పరిమితిలోనే ఉన్నప్పటికీ, నాడా దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో అతడిని తప్పించినట్లు ఏఎఫ్ఐ తెలిపింది. హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్టీపుల్‌చేజ్ స్వర్ణం, 5,000 మీటర్ల రజతం సాధించిన అవినాశ్ సేబుల్ స్టీపుల్‌చేజ్‌లో పాల్గొనడం ఖరారైంది. 5,000 మీటర్లలోనూ పోటీకి అనుమతి కోరగా.. సెప్టెంబర్ 10న ఢిల్లీలో జరిగే ఇండియన్ అథ్లెటిక్స్ సిరీస్ ఫైనల్లో అర్హత ప్రమాణం సాధిస్తేనే అవకాశం లభిస్తుంది. గుల్వీర్ సింగ్ 10,000, 5,000, 1,500 మీటర్లలో.. పారుల్ చౌధరి 3,000 మీటర్ల స్టీపుల్‌చేజ్, 5,000, 1,500 మీటర్లలో పోటీ పడనున్నారు.

# రుణ వృద్ధి కంటే ఆస్తుల నాణ్యతే ముఖ్యం

**ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ముర్ము సూచన**



**ముంబై:** రుణాల వృద్ధి వేగం పెరిగే కొద్దీ ఆస్తుల నాణ్యతపై ముప్పు పెరుగుతుందని, అందువల్ల రుణ వృద్ధి కోసం అండర్‌రైటింగ్ ప్రమాణాలను తగ్గించొద్దని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎస్.సి. ముర్ము ఎన్‌బీఎఫ్‌సీలను కోరారు. పరిశ్రమల సంఘం సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌బీఎఫ్‌సీలు కఠినమైన స్ట్రెస్ టెస్టింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డైనమిక్ ప్రొవిజనింగ్‌ను అమలు చేయాలని సూచించారు. రుణగ్రహీతల ఆర్థిక ఒత్తిడిని ముందుగానే గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ సాధనాలను వినియోగించాలని చెప్పారు.

### బలమైన పాలన.. కస్టమర్ రక్షణ


ఎన్‌బీఎఫ్‌సీలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముర్ము పేర్కొన్నారు. ఎన్‌బీఎఫ్‌సీల రుణాలు ప్రస్తుతం నామినల్ జీడీపీలో 16.7 శాతానికి పైగా ఉన్నాయని తెలిపారు. బలమైన గవర్నెన్స్, నైతిక విలువలు, సైబర్ భద్రతపై సంస్థలు దృష్టి పెట్టాలని సూచించారు. వినియోగదారుల రక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, బాధ్యతాయుత రుణాలు ఆర్‌బీఐ ప్రాధాన్య అంశాలని స్పష్టం చేశారు.

### బ్యాంకు నిధులపై ఆధారపడొద్దు

హీరో ఫిన్‌కార్ప్ సీఈవో, ఎండీ అభిమన్యు ముంజాల్ మాట్లాడుతూ.. ఎన్‌బీఎఫ్‌సీలు బ్యాంకు నిధులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు బాండ్, పాస్–త్రూ సర్టిఫికెట్ల మార్కెట్లను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. అంతర్జాతీయ మూలధనాన్ని సమీకరించేందుకు ఈసీబీ నిబంధనలను సమీక్షించాలని, గిఫ్ట్ సిటీ ద్వారా మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు.

# నాలుగో రోజూ నష్టాలే

- 417 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. 23,873 వద్ద నిఫ్టీ
- పెరిగిన ముడిచమురు ధరలు
- ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. ముడిచమురు ధరలు పెరగడం, ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, చివరి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు కుదేలయ్యాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 417.49 పాయింట్లు (0.55 శాతం) నష్టపోయి 76,152.86 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 41 పాయింట్లు (0.17 శాతం) తగ్గి 23,873.45 వద్ద ముగిసింది. గురువారం ఉదయం సెన్సెక్స్ లాభాలతో ప్రారంభమై ఒక దశలో 354.13 పాయింట్లు ఎగబాకి 76,924.48 గరిష్ఠాన్ని తాకింది. అయితే చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో లాభాలన్నీ ఆవిరై సూచీ భారీ నష్టాల్లోకి జారింది. టైటాన్, ట్రెంట్, ఐటీసీ, ఎంఅండ్ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, సన్ ఫార్మా, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

### ముడిచమురు సెగ

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర 1.57 శాతం పెరిగి బ్యారెల్‌కు 97.13 డాలర్లకు చేరింది. అధిక ముడిచమురు ధరలు దేశీయ మార్కెట్లకు ప్రధాన ప్రతికూలాంశంగా మారాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ ఆఫ్ రీసెర్చ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు, అధిక అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్ మార్కెట్‌పై ఒత్తిడి పెంచాయని తెలిపారు. మరోవైపు బ్యాంకింగ్, రియల్టీ షేర్లు కొంతమేర మార్కెట్‌కు అండగా నిలిచాయని నాయర్ తెలిపారు. చిన్న కంపెనీల షేర్లలోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించిందన్నారు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా.. యూరప్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. అమెరికా మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. బుధవారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐలు) రూ.6,688.37 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐలు) రూ.2,812.98 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

# చక్కెర ధరలు తగ్గుముఖం

- వారంలో 3.85 శాతం తగ్గిన రిటైల్ ధర
- దిగుమతులకు అనుమతి
- నిల్వలపై నిబంధనలు కఠినతరం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా చక్కెర సగటు రిటైల్ ధర వారం రోజుల్లో 3.85 శాతం తగ్గి కిలో రూ.62.57కు చేరింది. వారం క్రితం ఇది రూ.65.08గా ఉంది. చక్కెర దిగుమతులకు కేంద్రం అనుమతించడం, భారీ వినియోగదారులు, డీలర్ల నిల్వలపై నిబంధనలను కఠినతరం చేయడం ధరల తగ్గుదలకు కారణమయ్యాయి. అయితే గత నెలలోని రూ.49.33తో పోలిస్తే ఇప్పటికీ 27 శాతం అధికంగానే ఉంది. హోల్‌సేల్ ధర కిలోకు రూ.60.39 నుంచి రూ.57.62కు తగ్గింది. అయితే పాత ధరలకు కొనుగోలు చేసిన నిల్వలు పూర్తయ్యే వరకు రిటైల్ ధరల్లో తగ్గుదల పూర్తిగా కనిపించదని వ్యాపార వర్గాలు తెలిపాయి. కొత్త స్టాక్ తక్కువ ధరకు కొనుగోలు చేసిన తర్వాతే ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని, ఇందుకు కనీసం పది రోజులు పట్టవచ్చని పేర్కొన్నాయి. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు కేంద్రం 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుమతించింది. దేశంలో తగినంత నిల్వలు ఉన్నప్పటికీ మిల్లులు ధరలను పెంచుతున్నాయని కేంద్రం ఆరోపించింది. 2025–26 మార్కెటింగ్ సంవత్సరానికి ఉత్పత్తి అంచనాను 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు తగ్గించారు. దేశీయ వార్షిక డిమాండ్ 280–285 లక్షల టన్నులుగా ఉంది.

# భారత్ టెక్నాలజీ హబ్

- రానున్న రోజుల్లో మరిన్ని మెర్సిడెస్ మోడళ్లు
- కొత్త కార్ల విడుదలకు ప్రణాళిక
- మెర్సిడెస్–బెంజ్ సీఈవో ఓలా కల్లెనియస్



**న్యూఢిల్లీ:** భారత్‌ను కీలక వృద్ధి మార్కెట్, టెక్నాలజీ హబ్‌గా భావిస్తున్నట్లు జర్మనీకి చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్–బెంజ్ సీఈవో ఓలా కల్లెనియస్ తెలిపారు. రానున్న కొన్నేళ్లలో భారత్‌లో మరిన్ని కొత్త మోడళ్లను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్ (సియామ్) వార్షిక సదస్సు–2026లో వర్చువల్‌గా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో మెర్సిడెస్ ఇప్పటికే బలమైన బ్రాండ్‌గా స్థిరపడిందన్నారు. కంపెనీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు అనుగుణంగా పారిశ్రామికీకరణ చేపడతామని చెప్పారు. సృజనాత్మకత, ప్రతిభ, మేధస్సు, నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాల్లో భారత్ బలమైన వనరుల ను కలిగి ఉందని కల్లెనియస్ పేర్కొన్నారు. ఉత్పత్తి, సరఫరా వ్యవస్థ కూడా వేగంగా అభివృద్ధి చెందుతోం దన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతిక ఆధారిత వాహన తయారీ సంస్థ అభివృద్ధికి అవసరమైన అన్ని అవకాశాలు భారత్‌లో ఉన్నాయని తెలిపారు.

# బిగ్‌బాస్ 20తో ఏఐ+ స్మార్ట్‌ఫోన్ భాగస్వామ్యం

- ఐదు భాషల ఎడిషన్లలో బ్రాండ్ ప్రచారం
- హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, బెంగాలీ షోల్లో ఉత్పత్తి సమీకరణలు




**న్యూఢిల్లీ:** ఏఐ+ స్మార్ట్‌ఫోన్ బిగ్‌బాస్ సీజన్–20తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, బెంగాలీ భాషల్లోని ఐదు ఎడిషన్లలో ఈ భాగస్వామ్యం కొనసాగుతుందని సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా బ్రాండ్ చేరువను పెంచుకోవడమే లక్ష్యంగా పేర్కొంది. హిందీకి సల్మాన్ ఖాన్, తమిళానికి విజయ్ సేతుపతి, తెలుగుకు నాగార్జున అక్కినేని, కన్నడకు కిచ్చా సుదీప్, బెంగాలీకి సౌరవ్ గంగూలీ వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రేక్షకులకు చేరువయ్యేందుకు ఈ బహుభాషా వేదికను వినియోగించుకోనున్నట్లు ఏఐ+ తెలిపింది. భాగస్వామ్యంలో భాగంగా బిగ్‌బాస్ కార్యక్రమంలో ఉత్పత్తి ప్రదర్శనలు, బ్రాండెడ్ కార్యక్రమాలు, సందర్భానుసార కంటెంట్, డిజిటల్ ప్రచారం చేపట్టనుంది. భారత్‌లో అభివృద్ధి చేసిన టెక్నాలజీ బ్రాండ్‌గా ఏఐ+ స్మార్ట్‌ఫోన్.. నెక్స్ట్‌క్వాంటమ్ ఓఎస్‌తో ఉత్పత్తులను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. గోప్యతకు ప్రాధాన్యమిస్తూ అందుబాటు ధరల్లో స్మార్ట్‌ఫోన్, ఏఐఓటీ ఉత్పత్తులను అందించడంపై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించింది.

# స్టార్టప్‌లకు ఎల్‌టీఎస్ఎస్ 'ఫార్మ్'

- డీప్‌టెక్ ఆవిష్కరణలకు మార్కెట్ బాట
- ఇంజినీరింగ్ నైపుణ్యం, కస్టమర్ నెట్‌వర్క్‌తో సహకారం



**బెంగళూరు:** డీప్‌టెక్ స్టార్టప్‌ల ఆవిష్కరణలను మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీఎస్ఎస్) 'ఫార్మ్' వేదికను ప్రారంభించింది. టీఆర్ఎల్–4, అంతకంటే ఎక్కువ స్థాయి స్టార్టప్‌లకు ఇంజినీరింగ్ నైపుణ్యం, సహ–ఆవిష్కరణ, గ్లోబల్ కస్టమర్ నెట్‌వర్క్, మార్గదర్శకత్వం అందించనుంది. సాఫ్ట్‌వేర్ ఆధారిత మొబిలిటీ, ఇంధనం–పారిశ్రామిక ఆటోమేషన్, డిజిటల్ తయారీ, నెక్స్ట్‌జెన్ కంప్యూటింగ్, డేటా సెంటర్లు, సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫార్మ్‌లు, మెడ్‌టెక్ రంగాల్లోని స్టార్టప్‌లకు ప్రాధాన్యం ఇస్తుంది. ఎంపిక నుంచి పైలట్ ప్రాజెక్టులు, ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్, కస్టమర్ ప్రదర్శనలు, వాణిజ్యీకరణ వరకు సహకారం అందిస్తామని సంస్థ తెలిపింది. మంచి సాంకేతికతలకు పరిశ్రమ, కస్టమర్లతో అనుసంధానం కల్పించి మార్కెట్ చేరువను వేగవంతం చేయడమే లక్ష్యమని ఎల్‌టీఎస్ఎస్ సీఈవో, ఎండీ అమిత్ చద్దా తెలిపారు.



# ఏష నాగుల' మరో రికార్డు


## ఆ ఫీట్ సాధించిన తొలి తెలుగు పాట

ప్రస్తుతం సోషల్‌మీడియా సహా యూట్యూబ్‌ను ఓ ఊపు ఊపేస్తున్న పాట 'ఏషనాగుల' . షార్ట్స్, రీల్స్, మీమ్స్ ఒక్కటేంటి ఎక్కడా చూసినా ఇదే ట్రెండ్ నడుస్తోంది. అంతేకాదు, ఇప్పుడు ఈ పాట మరో రికార్డును కూడా బద్దలు కొట్టింది. విడుదలైన 5 రోజుల్లో 50o మిలియన్ వ్యూస్‌ను దాటేసిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించింది. చిత్ర బృందం ఈ విషయాన్ని తెలియజేస్తూ పోస్ట్ పెట్టింది. నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఏషనాగుల' మాస్ బీట్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. అనిరుధ్ మ్యూజిక్, స్క్రీన్‌పై నాని, కీర్తి సురేశ్ డ్యాన్స్ అలరిస్తున్నాయి. రిపీట్ మోడ్‌లో నెటిజన్లు ఈ సాంగ్‌ను ఆస్వాదిస్తున్నారు.

# ఎన్టీఆర్ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, 'కేజీఎఫ్', 'సలార్' వంటి బాక్సాఫీస్ హిట్స్ అందించిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'డ్రాగన్'. ఇందులో యంగ్ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. తాజాగా బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ కూడా ఈ చిత్రంలో భాగం కాబోతున్నట్లు ఓ వార్త నెట్టింట వైరల్ అవుతున్నది. ఫిలిమ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. ఎన్టీఆర్ డ్రాగన్ చిత్రంలో బాలీవుడ్ నటులు షాహిద్ కపూర్, ఆలియా భట్ కీలక పాత్రల్లో నటిస్తున్నారట. ఇప్పటికే వీళ్ల పాత్రలు కన్ఫర్మ్ కాగా.. త్వరలో దీనిపై అఫీషియల్ అప్డేట్ వచ్చే అవకాశం ఉన్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే.. ఇప్పటికే ఎన్టీఆర్, ఆలియా భట్ కలిసి 'RRR' చిత్రంలో నటించారు. ఇందులో ఆలియా భట్ రామ్ చరణ్ సరసన నటించినప్పటికీ, పలు సన్నివేశాల్లో ఎన్టీఆర్‌తో కలిసి ఉన్న సీన్స్ ఉంటాయి. అయితే.. ఇప్పుడు ఈ వైరల్ వార్తలతో ఫుల్ లెంగ్త్ సీన్స్ ఉంటే బాగుంటుంది అంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు పలువురు నెటిజన్లు. అలాగే వీరిద్దరిని మరోసారి స్క్రీన్‌పై చూసేందుకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నామంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా.. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన 50శాతం షూటింగ్ కంప్లీట్ అయినట్లు తెలుస్తుండగా.. నటీనటులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.







# నా జీవితంలో ఆ ఒక్క లోటు ఉండిపోయింది: కరీనా కపూర్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ ఇటీవల 'సింగం అగైన్'తో అలరించారు. త్వరలోనే పృథ్వీరాజ్ సుకుమారన్‌తో కలిసి మేఘనా గుల్జార్ దర్శకత్వంలో 'దాయరా' అనే క్రైమ్ డ్రామాలో కనిపించనున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్‌లో పాల్గొన్న కరీనా కపూర్ ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన విజయాలు సాధించినప్పటికీ, చిన్నతనంలో తీసుకున్న ఒక నిర్ణయం పట్ల ఇప్పటికీ పశ్చాత్తాపపడుతున్నట్లు తెలిపారు. తాను సరిగ్గా చదువు పూర్తి చేయకపోవడం ఇప్పటికీ తనను వెంటాడుతోందని ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఓపెన్ అయ్యారు.

సినిమాల్లోకి వచ్చాక పూర్తిగా నటనపైనే దృష్టి పెట్టడంతో 11వ తరగతి తర్వాత చదువును మధ్యలోనే ఆపేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ విషయం గురించి ఎవరైనా హేళన చేసినా ..అప్పట్లో ఒక నటిగా తనను తాను నిరూపించుకోవడానికి తన మనసు చెప్పిన మాటే విన్నానని కరీనా పేర్కొన్నారు. అయితే చదువును పూర్తి చేయకపోవడం తనకు పెద్ద లోటుగానే మిగిలిపోయిందని ఈ విషయంలో తాను ఇప్పటికీ బాధపడుతున్నట్లు ఆమె వివరించారు. అందుకే తన కొడుకులు ముందుగా చదువు పూర్తి చేశాకే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలని స్పష్టంగా చెప్పినట్లు వెల్లడించారు. భారత్‌లో బాలికల విద్యకు సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రచారం కోసం తనను సంప్రదించినప్పుడు, తన జీవితంలో ఉన్న ఆ లోటు కారణంగానే వెంటనే ఒప్పుకున్నానని చెప్పారు.

# పెళ్లి తర్వాత 3 నెలలు ఒకరినొకరం చూసుకోలేదు: రష్మిక



గాయం నుంచి కోలుకున్న రష్మిక తిరిగి వర్క్‌లో బిజీగా మారేందుకు సిద్ధమయ్యారు. తాజాగా తన గాయం గురించి రష్మిక మాట్లాడుతూ.. భర్త విజయ్ దేవరకొండతో సమయం గడిపేందుకే ఇలా అయిందని సరదాగా వ్యాఖ్యానించారు.

"పెళ్లయిన తర్వాత మూడు నెలల పాటు మేమిద్దరం ఒకరినొకరు చూసుకోలేదు. కేవలం ఫోన్‌లోనే మాట్లాడుకునేవాళ్లం. 'కాస్త విశ్రాంతి ఇద్దాం. నిన్ను ఇంట్లోనే ఉంచుతా' అని విశ్వమే ఇలా నాకు గాయం అయ్యేలా ప్లాన్ చేసిందేమో అనిపించింది. పెళ్లయ్యాక మేమిద్దరం కలిసి ఎక్కువ సమయం గడపడం ఇదే తొలిసారి. ఇది వినడానికి వింతగా అనిపించినా.. నాకు ఈ సమయం చాలా నచ్చింది. ఇద్దరం కలిసి ఇంట్లో ఆనందంగా గడిపాం. విజయ్‌కు ఎక్కువగా సీరియస్ డ్రామాలు, షోలు ఇష్టం. నాకేమో కే-డ్రామాలు (కొరియన్ డ్రామాలు) అంటే పిచ్చి. మేమిద్దరం రెండూ చూశాం. ఆయనకు కూడా కే-డ్రామాలు అలవాటు చేసేశా" అని రష్మిక సరదాగా చెప్పారు. విజయ్ తనను ఎప్పుడూ ఆటపట్టించేవాడని రష్మిక గుర్తుచేసుకున్నారు. 'మనం ఇలా ఎన్నో రోజులు గడపాలి. కానీ, ఎలాంటి గాయాలు లేకుండా' అంటూ జోక్స్ వేసేవాడని చెప్పారు. విశ్రాంతి తీసుకున్న రోజులు ఎప్పటికీ మంచి జ్ఞాపకాలుగా గుర్తుండిపోతాయని తెలిపారు.


'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. దీంతో కొన్ని వారాలు విశ్రాంతి తీసుకున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రాన్ని నవంబరు 27న పాన్ ఇండియా భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇటీవలే మేకర్స్ ప్రకటించారు. ఇక పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక కలిసి నటిస్తోన్న 'రణబాలి' అక్టోబర్ 16న విడుదల కానుంది.



# ఈసారి హిట్ కొడుతున్నాం

## 'సర్దార్-2'పై కార్తీ కామెంట్స్

మూడేళ్లుగా ఎదురుచూస్తున్న నా తమ్ములకు ఈసారి పక్కా హిట్ ఇస్తాను అంటున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'సర్దార్-2'. బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీకి పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించాడు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 10న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న కార్తీ 'సర్దార్-2'పై తాను ఎంత నమ్మకంగా ఉన్నానో తెలిపి ఫ్యాన్స్‌లో మరింత ఉత్సాహం నింపారు. ఈమేరకు చెన్నైలో జరిగిన సర్దార్-2 ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొన్న కార్తీ మాట్లాడుతూ.. 'నా అభిమానులు నన్ను పక్కా యాక్షన్ సినిమాల్లో చూడటానికి ఇష్టపడతారు. అయినప్పటికీ నేను చేసిన 'మెయ్యళగన్' (సత్యం సుందరం) చిత్రాన్ని వారు ఎంతోగానో ఆదరించారు. ఇక నలన్ కుమారసామి లాంటి ప్రతిభావంతుడైన దర్శకుడిని ప్రోత్సహించాలనే 'వా వాథియార్' చేశాను అది అంతగా హిట్ అందుకోలేదు. అలాగే రాజుమురుగన్ కాంబినేషన్‌లో ఒక మంచి సినిమా చేయాలనే ఉద్దేశంతో 'జపాన్' చేశాను. 'ఆవేశం' తరహాలో ఆ సినిమా ఉంటుందని భావించాను కానీ అనుకున్నట్లుగా రాలేదు. గత మూడేళ్లుగా అభిమానులకు తగిన విందు ఒదించలేకపోయాను అనే అసంతృప్తి నాలో ఉంది. అయితే ఈసారి 'సర్దార్ 2' విషయంలో ఎలాంటి లోటు ఉంచలేదు.. ఈసారి హిట్ కొడుతున్నాం' అంటూ ఆశ భావం వ్యక్తం చేశాడు కార్తీ.




Printed, Published & Owned by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published From 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, and Telangana - 508252. Editor: YAMJALA PRAVEEN, PRGI.No. TGTEL/26/A6221, Ph.No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website : www.tholivelugu.com